పెళ్లి ఎప్పుడో చెప్పలేను
**దానిపై అంతగా ఆసక్తి కూడా లేదు**
మిగతాది 8లో

తెలుగు దినపత్రిక
# కబురు
KABURU TELUGU DAILY
RNI APTEL/1999/00110

## ఇదండీ..కబురు..



సంపుటి : 23 సంచిక : 124 | ఆదివారం ఏప్రిల్ 20 2025 | ఎడిటర్: శివకుమార్ గౌడ్ | పేజీలు 8 | వెల-5

# అభివృద్ధిలో ప్రపంచంతో తెలంగాణ పోటీ

- ఢిల్లీ పరిస్థితులు చూసి గుణపాఠం తెచ్చుకోవాలి
- మూసీరివర్ ఫ్రంట్ అభివృద్ధికి కొందరు అడ్డు
- జపాన్ తెలుగు సమాఖ్య సదస్సులో సీఎం రేవంత్




కబురు న్యూస్,హైదరాబాద్,ఏప్రిల్ 19: అభివృద్ధిలో ప్రపంచంతోనే తెలంగాణ పోటీ అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ప్రస్తుతం జపాన్ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్.. శనివారం జపాన్ తెలుగు సమాఖ్య కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అన్ని రంగాల్లో తెలంగాణ అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. తెలంగాణ అభివృద్ధిలో జపాన్‌లోని తెలుగు వారు భాగం కావాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో ఐటీ, ఫార్మా రంగంలో ప్రగతి సాధించామని.. రాష్ట్రంలో త్వరలోనే డ్రై పోర్ట్ ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. టోక్యోలో రివర్ ఫ్రంట్‌ను పరిశీలించామన్నారు. మూసీనది ప్రక్షాళనకు కొందరు అడ్డుపడుతున్నారని మండిపడ్డారు. ఢిల్లీ పరిస్థితి చూసి మనం గుణపాఠం నేర్చుకోవాలన్నారు. మూసీ ప్రక్షాళన, మెట్రో విస్తరణ, ఆర్‌ఆర్‌ఆర్, రేడియల్ రోడ్స్ తెలంగాణ పురోగతికి కీలకమని పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధిలో అందరి సహకారం అవసరమని.. ప్రపంచంతో పోటీ-పడేలా తెలంగాణను అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు. తెలంగాణలో ఐటీ-, ఫార్మా రంగంలో సాధించాల్సినంత ప్రగతి సాధించామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. మూసీ ప్రక్షాళన, మెట్రో విస్తరణ, రీజనల్ రింగ్ రోడ్, రేడియల్ రోడ్స్ తెలంగాణ పురోగతికి కీలకం. తెలంగాణకు పెట్టుబడులు రావాలి.. పరిశ్రమలు పెరగాలి. ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెంచాలనేదే ప్రభుత్వ ఉద్దేశం. రాష్ట్ర అభివృద్ధిలో అందరి సహకారం అవసరం. మీ తోడ్పాటు-తో ప్రపంచంతోనే మనం పోటీ- పడొచ్చు. ఆలోచనలను రాష్ట్ర ప్రభుత్వంతో పంచుకోండి. సొంత ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకోవడంలో ఉన్న ఆనందం మీకు తెలుసని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

# ధాన్యం కొనుగోళ్లు సజావుగా సాగాలి

**- కలెక్టర్లకు మంత్రి ఉత్తమ్ సూచన**




కబురు న్యూస్,హైదరాబాద్,ఏప్రిల్ 19: ధాన్యం కొనుగోళ్లను తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటించి కొనుగోళ్లను పర్యవేక్షించాలన్నారు. వివిధ జిల్లాల కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పౌరసరఫరాలశాఖ ముఖ్య అధికారులతోనూ సమీక్షించారు. ధాన్యం కొనుగోళ్లపై ఆరా తీశారు. ఈ ఏడాది యాసంగిలో రికార్డు స్థాయిలో 127.50 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నాం. వానకాలం, యాసంగి కలిపి 281 లక్షల టన్నుల దిగుబడి వచ్చే అవకాశముంది. అందుకు అనుగుణంగా కొనుగోలు కోసం అధికారులు ఏర్పాట్లు- చేసుకోవాలని ఉత్తమ్ సూచించారు. ఎక్కడా సమస్యలు రాకుండా అధికారులను అప్రమత్తం చేయాలన్నారు.

# సమతుల ఆహారం..వ్యాయామం

**- ఇవే ఆరోగ్యానికి శ్రీరామ రక్ష**
**- వరల్డ్ లివర్ డే కార్యక్రమంలో అమిత్ షా**




కబురు న్యూస్,హైదరాబాద్,ఏప్రిల్ 19: సమతుల ఆహారంతో పాటు, తగిన వ్యాయామంతోనే ఆరోగ్యంగా ఉండగలమిన కేంద్రహోంమంత్రి అమిత్ షా అన్నారు. ఇందుకు ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు పాటించాలని అన్నారు. దేశ యువత ఆరోగ్యంపై దృష్టిసారించాలని సూచించారు. దానివల్ల మరో 40-50 ఏళ్లు జీవించి, దేశ వృద్ధికి దోహదం చేసే అవకాశం ఉంటుందని చెప్పారు. వరల్డ్ లివర్ డే సందర్భంగా దిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ...తన వెయిట్ లాస్ జర్నీని వెల్లడించారు. తాను పాటిస్తోన్న జీవనశైలిని మంత్రి వెల్లడించారు. తగిన నిద్రపోవాలి. నీరు, శరీరానికి సరిపడే పౌష్టికాహారం తీసుకోవాలి. ఇక రోజూ చేసే వ్యాయామం నాకెంతో ఉపయోగపడింది. అందుకే నేను ఇప్పుడు మీ ముందు ఇలా నిల్చున్నాను. నేను ఎలాంటి అల్లోపతి మందులు, ఇన్సులిన్ తీసుకోవడం లేదు. 2020 నుంచి కొనసాగుతోన్న ఈ తరహా వెయిట్ లాస్ జర్నీలో.. నిద్ర, వ్యాయామం అత్యంత కీలకం. వాటిని అంతా సీరియస్‌గా తీసుకోవాలి. శరీరం కోసం రెండు గంటల వ్యాయామం, మెదడు ఆరోగ్యం కోసం ఆరు గంటల నిద్ర ఉండాలి. ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. నా అనుభవం నుంచి ఇదంతా చెప్తున్నానని మంత్రి వెల్లడించారు.

మిగతాద్ది 2 లో

# బీఆర్ఎస్ గ్రాఫ్ పెరిగిందా? తగ్గిందా?..

**- కేటీఆర్ ఏమన్నారంటే?**



2 లో

కబురు న్యూస్,హైదరాబాద్,ఏప్రిల్ 19: బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు దొందూ దొందేనంటూ మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా బీఆర్ఎస్‌దే విజయం అంటూ ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ భవన్‌లో హైదరాబాద్ బీఆర్ఎస్ నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అత్యధిక స్థానాలు బీఆర్ఎస్ గెలుస్తుందన్నారు. 17 నెలల కాలంలో బీఆర్ఎస్ గ్రాఫ్ బాగా పెరిగిందన్నారు. హైదరాబాద్ లోకల్ బాడీ ఎమ్మెల్సీ ఎన్నికను బాయ్‌కట్ చేస్తున్నామని.. ఓటింగ్‌కు దూరంగా ఉండాలని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లను కేటీఆర్ ఆదేశించారు. విప్ ధిక్కరిస్తే పార్టీ నుంచి బహిష్కరణ తప్పదని హెచ్చరించారు.

# ధరణి లోపాలను సరిదిద్దిన భూభారతి: కడియం

కబురు న్యూస్,జనగామ,ఏప్రిల్ 19: రైతుల భూ వివాదాల పరిష్కారానికి భూ భారతి చట్టం వచ్చిందని స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ధరణిలోని లోపాలను భూ భారతి ద్వారా సవరించవచ్చ న్నారు. ధరణిలో పేర్లు తప్పు పడినా.. ఏ రకమైన సమస్య ఉన్నా సవరించుకునే అవకాశం లేదన్నారు. సాదాబైనామాలకు కూడా ధరణిలో పరిష్కారం లభించలేదన్నారు.భూ భారతిలో సమస్యలకు పరిష్కారం ఉంది.. అధికారులు మనసుపెట్టి రైతుల సమస్యలను పరిష్కరించాలన్నారు.రైతులకు బ్రహ్మాండంగా అవగాహన ఉంది కానీ అధికారులనే ట్రైన్ చేయాలని ఎమ్మెల్యే కడియం అన్నారు. రైతులకు బెటర్ సర్వీసెస్ ఇచ్చే ప్రయత్నం చేయాలి కానీ సమస్య పరిష్కారం కాదని తిరిగి పంపించవద్దన్నారు. ఒకప్పుడు కలెక్టర్ మాట అంటే సొల్యూషన్ వచ్చేది... సీఎం కంటే పవర్ ఫుల్ ఉండేది..ఇప్పుడు ఆ వ్యవస్థ




కూడా డైల్యూట్ అయిందన్నారు. భూ భారతి ద్వారా సమస్యలు తీరే అవకాశం ఉండడంతో రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు కడియం.




# భాజపాతో కేటీఆర్ లోపాయికారీ ఒప్పందం: మహేశ్‌కుమార్ గౌడ్

కబురు న్యూస్,హైదరాబాద్,ఏప్రిల్ 19: కేసుల నుంచి తప్పించుకునేందుకే భాజపాతో భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ లోపాయికారీ ఒప్పందం కుదుర్చుకున్నారని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ విమర్శించారు. అక్రమాలపై చర్యలు తీసుకోకూడదనే ఉద్దేశంతోనే మోదీకి కేటీఆర్ దాసోహమయ్యారని ఆరోపించారు. భారాస బలహీనత వల్లే కేంద్రం నుంచి రావాల్సిన నిధులు రాలేదని, పదేళ్లపాటు మోదీ తీసుకున్న నిర్ణయాలన్నింటికీ ఆ పార్టీ మద్దతిచ్చిందని అన్నారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. భారాస నాయకురాలు కవితను మద్యం స్కామ్ నుంచి కాపాడుకోవడానికి భాజపాకి ఊడిగం చేశారని దుయ్యబట్టారు. భాజపాకి కట్టు బానిసలా కేటీఆర్ పని చేస్తున్నారని, స్థానిక సంస్థల ఎన్నికల్లో భాజపాని గెలిపించాలని ఆయన తాపత్రయ పడుతున్నారని విమర్శించారు.

# నిమ్స్‌లో అగ్ని ప్రమాదం



కబురు న్యూస్,హైదరాబాద్,ఏప్రిల్ 19: నగరంలోని నిమ్స్ ఆస్పత్రిలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. నిమ్స్ ఎమర్జెన్సీ విభాగంలో ఒక్కసారిగా మంటలు చెలరేగి అగ్ని ప్రమాదం సంభవించింది. ఆస్పత్రి ఐదో అంతస్తులో మంటలు ఎగిసిడుతున్నాయి. నిమ్స్ ప్రాంతమంతా భారీగా పొగ కమ్ముకుంది. షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది.

# 2 వేల మంది రీపోస్టు చేశారు..

**వారిపై చర్యలు తీసుకుంటున్నారా?- స్మితా సభర్వాల్**



కబురు న్యూస్,హైదరాబాద్,ఏప్రిల్ 19: ఐఏఎస్ అధికారిణి స్మితా సభర్వాల్ కు గచ్చిబౌలి పోలీసులు నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. కంచ గచ్చిబౌలి భూముల అంశంలో ఆమెకు ఈనెల 12న నోటీసులు జారీ చేశారు. ఈ నోటీసులపై ఆమె ఎక్స్ వేదికగా స్పందించారు. పోలీసులకు పూర్తిగా సహకరించినట్లు తెలిపారు. చట్టాన్ని గౌరవించే వ్యక్తిగా పోలీసులు అడిగిన ప్రశ్నలకు వివరణ ఇచ్చినట్లు చెప్పారు. తాను రీపోస్టు చేసినట్లే రెండు వేల మంది చేసినట్లు పేర్కొన్నారు. వాళ్లందరిపైనా ఇలాంటి చర్య తీసుకుంటున్నారా..? అని ప్రశ్నించారు. చట్టం అందరికీ సమానమా.. ? ఎంపిక చేసిన వారినే టార్గెట్ చేస్తున్నారా..? అని స్మితా సభర్వాల్ అడిగారు. కంచ గచ్చిబౌలిలో వన్యప్రాణుల పరిస్థితి ఇదంటూ వైరల్ అయిన నకిలీ ఫొటోలను ఆమె సోషల్‌మీడియాలో షేర్ చేసిన నేపథ్యంలో పోలీసులు నోటీసులు ఇచ్చారు.

# కాలేజీ భవనంపై దూకి విద్యార్థి ఆత్మహత్య



కబురు న్యూస్,సూర్యాపేట,ఏప్రిల్ 19: :కాలేజ్ భవనంపై నుంచి దూకి బీటెక్ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషాదం సంఘటన సూర్యాపేట జిల్లాలో చోటుచేసుకుంది. చిలుకూరు మండలం గేట్ ఇంజినీరింగ్ కాలేజ్ లో మంచిర్యాల జిల్లా జైపూర్ మండలానికి చెందిన కృష్ణవేణి అనే విధ్యార్థిని బీటెక్ చదువుతోంది. శనివారం తెలవారుజామున కాలేజ్ భవనంపై నుంచి దూకి విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. అయితే, ఆత్మహత్య చేసుకునే ముందు..హాస్టల్ గదిలో తల్లితో కృష్ణవేణి ఉన్నట్లు తెలుస్తోంది. కాలేజ్ యాజమాన్య వేధింపులే ఆత్మహత్యకు కారణమా? లేక కుటుంబ కలహాలేమైనా ఉన్నాయా? అనే కోణంలో పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

తెలుగు దినపత్రిక RNI APTEL/1999/00110
కబురు
KABURU TELUGU DAILY

## సంపాదకీయం

# కత్తులతోనే పొత్తు పొడుపు!

అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా ఏడాది వ్యవధి ఉండగానే తమిళనాడులో ప్రత్యర్థి పార్టీల మధ్య చిట పటలు మొదలైపోయాయి. ఈసారి ఎలాగైనా నిలదొక్కుకుని పార్టీ జెండా రెపరెపలాడించాలని బీజేపీ కృతనిశ్చయంతో ఉన్నట్టు కనబడుతోంది. అందుకే ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హెూంమంత్రి అమిత్ షా తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌పై విమర్శల జోరుపెంచారు. స్టాలిన్ కూడా అంతే దీటుగా బదులిస్తున్నారు. రెండేళ్ల క్రితం తమను వీడివెళ్లిన అన్నా డీఎంకేతో బీజేపీ చెలిమిని ఖరారు చేసుకుంది. అందుకోసం అమిత్ షా చెన్నై రావటాన్ని చూస్తే రాబోయే పోరులో తమది కీలకమైన పాత్రని ఆ పార్టీ చెప్పదల్చుకున్నట్టు అర్థమవుతుంది.అయితే ఈ సాన్నిహిత్యం ఏమంత సజావుగా లేదని జరుగుతున్న పరిణామాలు చెబుతున్నాయి. కేవలం ఈ చెలిమి కోసం బీజేపీ అన్నామలైని రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి తప్పించి ఆ స్థానంలో నయనార్ నాగేంద్రన్‌ను నియ మించింది. అన్నామలై గత రెండేళ్లుగా డీఎంకే సర్కారుపైకి దూకుడుగా పోతున్నారు. నిరుడు జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో పార్టీకి ఆధిపత్య కులాల వోట్లు రాబట్టడంలో, యువతను సమీకరించటంలో ఆయన విజయం సాధించారు. సీట్లయితే రాలేదుగానీ... బీజేపీ వోటు శాతం 11.24 శాతా నికి చేరుకుంది. కానీ ఆ దూకుడు పొత్తు రాజకీయాల్లో చిచ్చు పెడుతుందన్న భయం బీజేపీ అధిష్ఠా నంలో వుంది. ఎందుకంటే లోక్‌సభ ఎన్నికల సందర్భంగా అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ సీఎం పళనిస్వామిపై అన్నామలై తీవ్ర విమర్శలు చేశారు. అవి వ్యక్తిగత స్థాయికి వెళ్లి పోయాయి. అందుకే ఎన్నికల వరకూ పొత్తు సజావుగా వుండాలంటే అన్నామలైని తప్పించటమే మంచిదని కేంద్ర నాయకత్వం భావించింది. నాగేంద్రన్ అన్నాడీఎంకే నుంచి వచ్చినవారే. జయ సర్కారులో పళని స్వామి, ఆయనా సహచరులు కూడా. 2016లో జయ మరణం తర్వాత నాగేంద్రన్ బీజేపీ కండువా కప్పుకున్నారు. ఆ మాటెలావున్నా రెండు పార్టీలకూ ఇది ఇష్టం లేని పొత్తే. కొన్ని సీట్లయినా సాధించుకోగలిగితే ద్రవిడ కోటలో పాగా వేశామన్న అభిప్రాయం కలిగించ వచ్చని బీజేపీ ఆశిస్తోంది.అటు అన్నాడీఎంకే పరిస్థితీ ఏమంత బాగోలేదు. జయ మరణంతో అది అనాథగా మారింది. అంత ర్గత కీచులాటల మధ్య 2021 వరకూ ప్రభుత్వం మనుగడ సాగించినా తర్వాత అది మూడు ముక్క లైంది. పళనిస్వామి నేతృత్వంలోని అన్నాడీఎంకేకు అసెంబ్లీ ఎన్నికల్లో 66 స్థానాలొచ్చాయి. కానీ గత లోక్‌సభ ఎన్నికల్లో పూర్తిగా తుడిచిపెట్టుకుపోయింది. మొత్తం 39 స్థానాలనూ డీఎంకే కూటమి గెల్చుకుంది. అందుకే అటు బీజేపీకి, ఇటు అన్నాడీఎంకేకు ప్రస్తుత పొత్తు ప్రాణావసరమైంది.సమస్యేమంటే రెండు పార్టీల మధ్యా పొత్తు ఏర్పడినా, అది ఎన్డీయే కూటమిగా ఉంటుందని అమిత్ షా చెప్పినా ఈ చెలిమితో ఇరుపక్షాలూ ఇబ్బంది పడుతున్న వైనం కనబడుతోంది. లోక్‌సభ ఎన్నికల్లో అన్నాడీఎంకే లేకుండానే తాము 11.24 శాతం వోట్లు రాబట్టుకోగలిగామని బీజేపీ ధీమాగా వుంది. కానీ ఆ పరిస్థితి అన్నాడీఎంకేలో లేదు. అధికారంలో పాలుపంచుకుంటామో, లేదో ఎన్నికల తర్వాతే చెబుతామని షా అంటే... ఎన్నికల్లో పోటీవరకే పొత్తులని పళనిస్వామి ప్రక టించారు. తమిళనాడు రాజకీయ ధోరణులు గమనిస్తే అక్కడ కూటమి ప్రభుత్వాలు ఎప్పుడూ లేవు. పొత్తులున్నా రాష్ట్ర మంత్రివర్గంలో ఏనాడూ జాతీయ పార్టీలకు చోటీయలేదు. ఇప్పుడు కూడా అదే కొనసాగుతుందనుకుంటే తప్ప తమిళ వోటర్లు కనికరించరని పళనిస్వామి, అమిత్ షాలు అనుకుని వుండొచ్చు. అయితే డీఎంకేపై విరుచుకుపడటానికి తగిన ఆయుధాలు లేకపోవటం ఎన్డీయే కూటమికున్న ప్రధాన సమస్య. కాశీకి ప్రత్యేక రైలు నడపటం, కొత్త పార్లమెంట్ భవనంలో సెంగోల్, వీణ పెట్టడం ద్రవిడ రాజకీయ ప్రాబల్యంగల తమిళనాడును అంతగా ఆకర్షించినట్టు లేదు. స్టాలిన్ అమ్ములపొదిలో చాలా అస్త్రాలున్నాయి. ముఖ్యంగా ఆయన తమిళుల ఆత్మగౌరవంఅంశాన్ని ముందుకు తెచ్చారు. తమిళులు అనాగరికులని కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వ్యాఖ్యా నించటం, అనంతరం క్షమాపణ చెప్పటం ప్రస్తావిస్తున్నారు. బలవంతంగా హిందీ రుద్దాలని చూస్తు న్నారని ఆరోపిస్తున్నారు. ఒడిశా అసెంబ్లీ ఎన్నికల్లో అప్పటి సీఎం నవీన్ పట్నాయక్‌కు సన్నిహి తుడైన తమిళ ఐఏఎస్ అధికారి వీకే పాండ్యన్‌పై బీజేపీ రేపిన దుమారాన్ని గుర్తుచేస్తున్నారు.ఒడిశా ప్రజలపై తమిళులు పెత్తనం ఎలా చేస్తారని ప్రశ్నించటాన్ని ఎత్తిచూపుతున్నారు. గత పదేళ్లలో తమిళ నాడుకు కేంద్ర నిధులు మూడు రెట్లు పెరిగినా కొందరికి ఏడవటం అలవాటైపోయిందన్న ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యలనూ ఆయన తనకు అనుకూలంగా మలుచుకున్నారు. తమ వంతు వాటా అడగటం తమ హక్కని, అందుకు ఏడవటం లేదా బానిసత్వం చేయటం చేతకాదని స్టాలిన్ జవాబి చ్చారు. 234 స్థానాలుగల అసెంబ్లీలో గత ఎన్నికల్లో డీఎంకే సొంతంగా 133, మిత్రులతో కలిసి 159 గెల్చుకుంది. 46 శాతం వోట్లు రాబట్టింది.ఇప్పటికైతే తమిళనాట సామాజిక న్యాయం, రాష్ట్రాల హక్కులు, ఆత్మగౌరవం ప్రధానాంశాలు. గవర్నర్ ఆర్‌ఎన్ రవి అసెంబ్లీ ఆమోదించిన పది బిల్లుల్ని దీర్ఘకాలం పెండింగ్‌లో ఉంచటం, సుప్రీంకోర్టు ఆయన్ను మందలించటంతోపాటు వాటిని ఆమోదించినట్టుగా భావించాలని చెప్పటం స్టాలిన్‌కు మరింత శక్తినిచ్చింది. అవినీతి పెరిగిందని, వేలకోట్ల ప్రజాధనాన్ని డీఎంకే నేతలు దోచు కుంటున్నారని, శాంతిభద్రతలు దెబ్బతిన్నాయని బీజేపీ చేస్తున్న ఆరోపణలు ప్రజల్ని ఎంతవరకూ కదలించగలవో చూడాలి. అంతకన్నా ముందు అసెంబ్లీ ఎన్నికలు జరిగే వచ్చే ఏప్రిల్‌నాటికైనా తమ పొత్తు విషయంలో ఆత్మవిశ్వాసాన్ని కనబర్చటం అవసరమని ఎన్డీయే గుర్తించాలి.

# మంత్రులకు తప్పిన ప్రమాదం

మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఎంపి మల్లు రవిలకు తృటిలో పెను ప్రమాదం తప్పింది. నాగర్‌కర్నూల్ జిల్లాలో మంత్రులు, ఎంపి భూభారతి సదస్సులో పాల్గొనేందుకు వచ్చారు. ఆ సమయంలో వారు ప్రయాణిస్తున్న హెలికాప్టర్ ల్యాండింగ్ అవుతున్న సమయంలో హెలిప్యాడ్ సమీపంలో అగ్ని ప్రమాదం జరిగింది. వెంటనే అప్రమత్తమైన అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు మంటలను అదుపు చేశారు. దీంతో ప్రమాదం తప్పింది. హెలికాప్టర్ ల్యాండ్ కోసం ఇచ్చిన సిగ్నల్ బుల్లెట్ కారణంగానే ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది.

# భూసమస్యలు తీర్చేందుకే భూభారతి

## - ఎమ్మెల్యే రోహిత్ రావు వెల్లడి

భూ సమస్యలు తీర్చేందుకే ప్రభుత్వం భూభారతిని తీసుకువచ్చిందని ఎమ్మెల్యే రోహిత్ రావు అన్నారు. రామాయంపేట రైతు వేదికలో భూభారతిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం హయంలో ఉన్న ధరణి అంతా తప్పుల తడక అన్నారు. అది కేవలం మాజీ ముఖ్యమంత్రి కుటుంబీకులకే ఉపయోగ పడ్డదన్నారు. నేడు ప్రజలందరికీ ఉపయోగపడే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకు వచ్చిందన్నారు. పదేళ్లలో మెదక్ నియోజక వర్గాన్ని ఏమాత్రం అభివృద్ధి చేయలేదన్నారు. తాము అధికారంలోకి వచ్చిన సంవత్సర కాలంలో ఎంతో అభివృద్ధి చేశామని తెలిపారు. తాను ప్రజలకు కష్టాలు తీర్చేందుకు పనిచేస్తున్నారు. కార్యక్రమంలో కలెక్టర్ రాహుల్ రాజ్, ఆర్డీవో రమాదేవి, తహసీల్దార్ రజిని ఉన్నారు. భూ సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం భూభారతి చట్టం తీసుకువచ్చిందని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. అల్లాదుర్గ మండలం చేవెళ్ల రైతు వేదికలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అడిషనల్ కలెక్టర్ నగేశ్, ఆర్డీవో రమాదేవి పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ భూముల విషయంలో ఎలాంటి సమస్యలు ఏర్పడినా పరిష్కరించుకోవడానికి భూభారతి ద్వారా ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. భూమి విలువ రూ.5 లక్షల లోపు ఉన్న పక్షంలో ఆర్డీవో స్థాయి, అంతకంటే పైగా ఉన్న పక్షంలో కలెక్టర్ స్థాయి అధికారులు సమస్యను పరిష్కరించడానికి అవకాశం కల్పించారని తెలిపారు. పవర్
పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రైతులకు భూభారతి పోర్టల్ లో ఉన్న అంశాలపై అవగాహన కల్పించారు.

# ఎపిలో క్రమంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

ఏపీలో ఎండలు ఠారెత్తిస్తున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు అమాంతం పెరగడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. వాతావరణశాఖ వెల్లడించిన వివరాల ప్రకారం శనివారం అత్యధికంగా తిరుపతి జిల్లా రేణిగుంటలో 42.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ప్రకాశం జిల్లా గొల్లవిడిపిలో 42.6 డిగ్రీలు, వైఎస్ఆర్ జిల్లా అట్లూరులో 42.3 డిగ్రీలు, పల్నాడు జిల్లా కాకానిలో 41.6 శాతండిగ్రీలు, అన్నమయ్య జిల్లా కంబాలకుంటలో 41.5 డిగ్రీలు, చిత్తూరు జిల్లా నగరిలో 41.4 డిగ్రీలు, నెల్లూరు జిల్లా జలదంకిలో 41.3 శాతండిగ్రీలు, నంద్యాల జిల్లా పాములపాడులో 41.2 శాతం డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

# టిడిపి స్క్రిప్ట్ చదువుతున్న విజయసాయి

## మాజీ ఎమ్మెల్యే కోరుముట్ల శ్రీనివాస్

మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి నోట టిడిపి పలుకులు వస్తున్నాయని, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేత, మాజీ ఎమ్మెల్యే కోరుముట్ల శ్రీనివాస్ సంచలన ఆరోపణలు చేశారు .. వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డితో పాటు విజయవాడలోని సిట్ విచారణ కార్యాలయం దగ్గరకు వచ్చిన కోరుముట్ల శ్రీనివాస్ ఈ వ్యాఖ్యలు చేశారు. విజయసాయిరెడ్డి మా పార్టీ నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి.. ఆయన టీడీపీ స్క్రిప్ట్ చదువుతున్నాడు అని ఆరోపించారు.. అయితే, వైఎస్ జగన్ కు సన్నిహితంగా ఉండే వారిపై బురద చల్లాలనే ఉద్దేశ్యంతో ఎంపీ మిథున్ రెడ్డికి సిట్ నోటీసులు ఇచ్చిందని విమర్శించారు.. సిట్ కావాలనే ఇదంతా చేస్తోందన్నారు. కూటమి ప్రభుత్వంలోనే గుడులు, బడుల దగ్గర బెల్ట్ షాపులు పెరిగాయని టీ-డీపీ తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్ చెప్పారని వ్యాఖ్యానించారు.. నేరుగా టీ-డీపీ ఎమ్మెల్యేనే కూటమి ప్రభుత్వం తీరుపై విమర్శలు చేసిన పరిస్థితి రాష్ట్రంలో ఉందన్నారు.. గత ప్రభుత్వంలో లిక్కర్ అమ్మకాలపై కాదు.. సిట్ విచారణ కూటమి ప్రభుత్వంలో లిక్కర్ వ్యాపారంపై చేయాలని డిమాండ్ చేశారు.

# గాజాపై బాంబుదాడి 70మంది పాలస్తీనియన్ల మృతి

ఇజ్రాయిల్ సైన్యం గాజాపై మరోసారి బాంబుదాడికి పాల్పడింది. శుక్రవారం ఇజ్రాయిల్ సైన్యం గాజాలోని ఓల్డ్ సిటీ తుఫాతో సహా పలు ప్రదేశాల్లో ఇళ్లపైనా, సహాయక శిబిరాలపైనా బాంబు దాడికి పాల్పడింది. ఈ దాడి వల్ల 70 మందికిపైగా పాలస్తీనియన్లు మృతి చెందినట్లు వైద్య వర్గాలు మీడియాకు వెల్లడించాయి. ఇజ్రాయిల్ పాల్పడుతున్న వరుస దాడులవల్ల పాలస్తీనా ప్రజలు ఆకలితో అలమటిస్తున్నారని ఐక్యరాజ్యసమితి హెచ్చరించింది. తక్షణమే గాజా ప్రజలకు ఆహారం అవసరం అని.. తక్షణమే వారికి ఆహారాన్ని అందించాలని ఐక్యరాజ్యసమితి యొక్క ఆహార కార్యక్రమం అత్యవసర హెచ్చరికను జారీ చేసింది. కాగా, ఇజ్రాయిల్ బాంబు దాడుల వల్ల పాలస్తీనా ప్రజలు మానసికంగా ఎంతో కుంగిపోయారు. ఇజ్రాయిల్ దిగ్బంధనం వల్ల ప్రజలు వారి పిల్లలకు కనీసం ఆహారం కూడా పెట్టు-కోలేని దీనావస్థలో ఉన్నారని గాజాలోని మీడియా ప్రతిధి తెలిపారు.

# బీఆర్ఎస్ గ్రాఫ్ పెరిగిందా? తగ్గిందా?..

మొదటిపేజీ తరువాయి
హెచ్‌సీయూ భూ కుంభకోణం వెనుక బీజేపీ ఎంపీ ఉన్నాడంటూ కేటీఆర్ ఆరోపించారు. బీజేపీ ఎంపీలు తెలంగాణకు ఒక్క రూపాయైనా తెచ్చారా? అంటూ ప్రశ్నించారు. హెరాల్డ్ కేసుపై కాంగ్రెస్ నేతలు మాట్లాడుతుంటే.. రేవంత్ ఒక్కమాట కూడా మాట్లాడటం లేదంటూ మండిపడ్డారు. కేసీఆర్ దీక్ష, పోరాటంతోనే తెలంగాణ వచ్చిందన్న.. కేటీఆర్.. బీఆర్ఎస్ సమర్థవంతమైన పాత్ర పోషిస్తుందన్నారు.
చేసినవి చెప్పుకోనందుకే అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయామంటూ కేటీఆర్ చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం హెచ్‌సీయూ, హైడ్రా, మూసీ పేరుతో అరాచకాలు సృష్టిస్తోందని విమర్శలు గుప్పించారు. బీజేపీ ఎంపీలు కాంగ్రెస్‌ను ఒక్క మాట కూడా అనరని.. హెచ్‌సీయూ భూములపై ప్రధాని మోదీ ఎందుకు విచారణ జరిపించడం లేదంటూ కేటీఆర్ ప్రశ్నించారు.

# సమతుల ఆహారం..వ్యాయామం

మొదటిపేజీ తరువాయి
ఇదివరకు ప్రధాని మోదీ కూడా ఇలాంటి సూచనలే చేసిన సంగతి తెలిసిందే. తమ అదనపు బరువును తగ్గించుకోవాలని ప్రజలకు మోదీ సూచించారు. అనేక వ్యాధులకు ఊబకాయమే ప్రధాన కారణమని పేర్కొన్నారు. క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం ద్వారా, వంటనూనెల వినియోగాన్ని 10 శాతం తగ్గించడం ద్వారా శరీరంలోని అధిక కొవ్వును కరిగించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. మన జీవనశైలితో ముడిపడిన వ్యాధులతో మన ఆరోగ్యానికి భారీ ముప్పు పొంచిఉంది. ఊబకాయం వాటిల్లో ఒకటి. ఇది అనేక వ్యాధులకు మూలకారణంగా నిలుస్తోంది. 2050 నాటికి దేశంలో ఊబకాయుల సంఖ్య 44 కోట్లకు చేరుతుందని ఓ నివేదిక పేర్కొంది. ఈ సంఖ్య చాలా పెద్దది..భయపెట్టేది. నివేదికలోని అంశం వాస్తవరూపం దాలిస్తే..ప్రతిముగ్గురిలో ఒకరు ఊబకాయంతో బాధపడతారు. ఈ పరిస్థితి తలెత్తకుండా ప్రజలు తమ ప్రయత్నాన్ని ప్రారంభించాలి. అదేవిధంగా వంటనూనెల వాడకాన్ని 10 శాతం తగ్గించాలని గతంలోనే సూచించా. వంటనూనెల కొనుగోలును 10 శాతం తగ్గిస్తామంటూ ప్రతిఒక్కరూ ప్రతిజ్ఞ చేయాలి. క్రమం తప్పకుండా చేసే వ్యాయామం, సైక్లింగ్‌తో ఊబకాయం దూరమవుతుంది' అని మోదీ పేర్కొన్న సంగతి తెలిసిందే.

# అమాయక యువతులతో వ్యభిచారం

## - గుట్టురట్టు చేసిన పోలీసులు

**హైదరాబాద్,ఏప్రిల్19**
సికింద్రాబాద్ పరిధిలో వ్యభిచారం నిర్వహిస్తున్న ముఠా గుట్టు రట్టు అయ్యింది. రాంగోపాల్‌పేటలోని బాపుబాగ్ కాలనీలో ఓ ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్న ముఠాను పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. ఉద్యోగాల కోసం హైదరాబాద్ వచ్చిన అమాయక యువతులకు మాయమాటలు చెప్పి వ్యభిచారంలోకి దింపుతున్నారు. ఈక్రమంలో సమాచారం అందుకున్న పోలీసులు.. స్వప్న అనే మహిళ యువతులను వ్యభిచారంలోకి లాగుతున్నట్లు గుర్తించారు. దీంతో వ్యభిచారం నిర్వహిస్తున్న ఇంటిపై పోలీసులు దాడులు చేశారు. ముఠా నుంచి ఇద్దరు యువతులను రక్షించారు. ముఠాలోని మహమ్మద్ అవియాస్, హుస్సేన్‌లను పోలీసులు అరెస్టు చేశారు. పరారీలో ఉన్న లడ్డు, స్వప్న కోసం పోలీసులు గాలిస్తున్నారు.

# దుండగుల కాల్పుల్లో భారతీయ యువతి మృతి

కెనడాలో భారతీయుల వరుసగా హత్యకు గురవుతున్నారు. ఒట్టావా సమీపంలోని రాక్‌లాండ్ ప్రాంతంలో ఓ భారతీయుడు కత్తి పోట్లకు గురై మృతి చెందిన విషయం మరువక ముందే మరో భారతీయురాలు కాల్పుల్లో మృతి చెందింది. భారత కాన్సులేట్ తెలిపిన వివరాల ప్రకారం.. హమిల్టన్‌లోని కాలేజీలో చదువుతున్న హర్‌సిమ్రత్ రంధవా ఓ దుండగుడు కాల్పులో మృతి చెందింది. రంధవా బస్టాప్ వద్ద వేచి ఉండగా.. రెండు కార్లలో వచ్చిన ఇద్దరు దుండగులు ఒకరిపై ఒకరు కాల్పులు జరుపుకున్నారు. అయితే, అందులోని ఓ బుల్లెట్ మిస్ అయ్యి రంధవాకు తగిలింది. ఘటనపై సమాచారమందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని, బాధితురాలిని ఆసుపత్రికి తరలించారు. అయితే, ఆమె అప్పటికే ప్రాణాలు కోల్పోయినట్లు- వైద్యులు ధ్రువీకరించారు. హర్‌సిమ్రత్ రంధవా మతిపై భారత కాన్సులేట్ దిగ్భాం÷-రతి వ్యక్తంచేసింది. మృతురాలి కుటు-ంబానికి అన్నివిధాలా అండగా ఉంటామని, అవసరమైన సాయం అందిస్తామని హామీ ఇచ్చింది.

# ఢిల్లీలో కుప్పకూలిన భవనం: నలుగురు మృతి

ఢిల్లీలోని ముస్తఫాబాద్ ఏరియాలో శనివారం తెల్లవారుజామున నాలుగు అంతస్తుల భవనం కుప్ప కూలింది. ఈ ప్రమాదంలో నలుగురు మృతి చెందారు. శిథిలాల కింద దాదాపు రెండు డజన్ల మంది చిక్కుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఇప్పటివరకు కనీసం 14 మందిని రక్షించామన్నారు. శిథిలాల కింద మరింత మంది ఉండే అవకాశం ఉన్నట్లు- తెలిపారు. ఘటన స్థలంలో పోలీసులు, ఎన్డీఆర్ఎఫ్ బృందం, అగ్నిమాపక సిబ్బంది రంగంలోకి సహాయక చర్యలు చేపట్టాయి. ఈ ప్రమాదంపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# వడదెబ్బకు ఉపాధికూలీ మృతి

వడదెబ్బతో ఉపాధి కూలీ మృతి చెందిన ఘటన వైఎస్ఆర్ కడప జిల్లా సింహాద్రిపురం మండలంలోని గురజాలలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ఉపాధి కార్మికుడు బోరెడ్డి ఓబుల్ రెడ్డి(50) రోజులాగే అందరితోపాటు ఉపాధి పనులకు వెళ్లారు. ఎండకు తాళలేక పని చేస్తూ ఒక్కసారిగా కుప్పకూలి చనిపోయారు. తోటి కార్మికులు ఆయనను చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించాగా.. వడదెబ్బతో మృతి చెందినట్లు- వైద్యులు తెలిపారు. ఓబుల్ రెడికి భార్య ఈశ్వరమ్మతో పాటు- కుమారులు ఉన్నారు. విషయం తెలుసుకున్న ఏపీవో జయ భారతి, ఈసీ శ్రీనివాసరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి మృతుని కుటుంబానికి ఆదుకునే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

## పోషణ పక్వాడ కార్యక్రమం...




**కబురు న్యూస్,బోధన్ ఏప్రిల్ 19...**
బోధన్ పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయంలో పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఐసిడిఎస్ సిడిపిఓ పద్మ పోషకాహారం పిల్లలకు అందించాల్సిన పౌష్టికాహారం గురించి వివరించారు. గర్భిణీ స్త్రీలలో రక్తహీనత రాకుండా ఉండాలంటే తాజా కూరగాయలు, పండ్లు ఆకుకూరలు, చిరుధాన్యాలు,పాలు సమృద్ధిగా తీసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఆకుకూరలు, చిరు ధాన్యాలను తినడం వల్ల ఆరోగ్యంగా ఉండొచ్చని తెలిపారు. పిల్లలకి బయట జంక్ ఫుడ్ పెట్టొద్దని ఇంట్లో తయారుచేసిన పౌష్టికాహారం మాత్రమే పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ విఠల్ రాజు, సూపర్వైజర్ రాధిక, అంగన్వాడీ టీచర్స్, గర్భవతులు, బాలింతలు, పిల్లలు పాల్గొన్నారు.

## జేఈఈ మెయిన్స్ లో 4000ర్యాంక్ సాధించిన అమ్దాపూర్ వాసి...



**కబురు న్యూస్,బోధన్ ఏప్రిల్ 19..**
బోధన్ మండలంలోని అమ్దాపూర్ గ్రామానికి చెందిన నారాయణ జేఈఈ మెయిన్స్ లో 4000ర్యాంక్ సాధించారు. అమ్దాపూర్ గ్రామానికి చెందిన కాలేవార్ లక్ష్మి నారాయణ ఆర్టీసీ కండక్టర్ కుమారుడు కాలేవార్ సంకీర్త్ నారాయణ మాదాపూర్ లో ఇంటర్ చదువుతూ జెఈఈ మెయిన్స్ పరీక్షలు రాశారు. ఇటీవల విడుదల చేసిన ఫలితాలలో 99.73 శాతంతో ఆల్ ఇండియా ర్యాంక్ 4000 సాధించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. అతను ఈ విజయం సాధించడం పట్ల గ్రామానికి చాలా గర్వ కారణమని ఆనందం వ్యక్తం చేశారు.

## ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు...



**- సబ్ కలెక్టర్ వికాస్..**

**కబురు న్యూస్,బోధన్ ఏప్రిల్ 19..**
ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు ఉంటాయని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో హెచ్చరించారు. శనివారం బోధన్ పట్టణంలోని బైపాస్ రోడ్ లో వెళ్తున్న ఇసుక టిప్పర్లను నిలిపి సబ్ కలెక్టర్ వికాస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వే బిల్లులను పరీక్షించారు. వే బిల్లులు లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న వాహనాలను సీజ్ చేయడం జరుగుతుందన్నారు.

## నేడు బీఆర్ఎస్ పార్టీ సన్నాహక సభ...

**కబురు న్యూస్,బోధన్ ఏప్రిల్ 19..**
భారత రాష్ట్ర సమితి రజతోత్సవ మహాసభ ఈ నెల 27న వరంగల్ ఎల్కతుర్తిలో నిర్వహిస్తున్న సందర్భంగా నేడు ఉదయం 10 గంటలకు బోధన్ పట్టణంలోని అప్నా ఫంక్షన్ హాల్ లో సన్నాహక సభ ఏర్పాటు చేయడం జరిగిందని బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ ఎమ్మెల్యే షకీల్ ఆమెర్ అధ్యక్షతన చేపడుతున్న కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విచ్చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి బోధన్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

## బహిరంగ సభ గోడ ప్రతులను ఆవిష్కరించిన బారాస నాయకులు



**కబురు న్యూస్ బాన్సువాడ ఏప్రిల్ 19**
నసురుల్లబాద్ మండల కేంద్రంలో శనివారం మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ జూబేర్ స్థానిక నాయకులతో కలిసి వరంగల్ రజతోత్సవ మహాసభ గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరంగల్లో నిర్వహించే పార్టీ 25 సంవత్సరాల రజతోత్సవ బహిరంగ సభను కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు నర్సింలు గౌడ్, అఫ్రోజ్, సాయిలు, రమేష్, రాములు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు

# రైతు మహోత్సవం ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

**- లోటుపాట్లకు తావులేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆదేశం...**









**కబురు న్యూస్,నిజామాబాద్, ఏప్రిల్ 19 :**
రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు మూడు రోజుల పాటు నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించనున్న రైతు మహోత్సవం ఏర్పాట్లను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం అట్టహాసంగా చేపడుతున్న ఈ రైతు మహోత్సవాన్ని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభిస్తారని కలెక్టర్ తెలిపారు. మూడు రోజుల పాటు కొనసాగే ఈ మహోత్సవంలో వివిధ ప్రాంతాలకు చెందిన రైతులు హాజరై వారు పండించిన ఉత్పత్తులను ప్రదర్శిస్తారని, సహజసిద్ధమైన పద్ధతులలో పంటల సాగు, ఆధునిక యాంత్రీకరణ వినియోగం, అధునాతన వంగడాలు, పసుపు ఆధారిత ఉత్పత్తులు, పరిశ్రమల స్థాపనకు గల అవకాశాలు తదితర అంశాలకు సంబంధించి సుమారు 150 వరకు స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. సాగు రంగానికి ఉపకరించే నూతన ఆవిష్కరణలతో కూడిన అధునాతన పరికరాలు, మేలురకం విత్తనాలను ప్రదర్శిస్తారని అన్నారు. వ్యవసాయం, అనుబంధ విభాగాలు, విశ్వవిద్యాలయాలు, బ్యాంకులు, స్టార్టప్ కంపెనీలు, ఎఫ్పీఓలు, ఇతర ప్రైవేట్ కంపెనీలకు సంబంధించిన స్టాల్స్ ఉంటాయని వివరించారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, నిపుణులు రైతులకు సాగు రంగంలో అవలంభించాల్సిన ఆధునిక విధానాలు, అధిక దిగుబడుల సాధనకు పాటించాల్సిన పద్ధతులు, పెట్టుబడులను ఎలా తగ్గించుకోవడం, అధిక లాభాలను అందించే పంటలను ఎలా ఎంపిక చేసుకోవాలి తదితర అంశాల గురించి అవగాహన కల్పిస్తారని అన్నారు. ప్రగతిశీల అవార్డు గ్రహీత రైతులు తమ అనుభవాలను తోటి రైతులతో పంచుకుంటారని తెలిపారు. ఇలా విశేష ప్రాధాన్యతతో కూడిన రైతు మహోత్సవ కార్యక్రమానికి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు జరిపించాలని ఈ సందర్భంగా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. స్టాల్స్,వేదిక,షామియానాలు, సిట్టింగ్ ఏర్పాట్లు,తాగునీటి వసతి,పార్కింగ్ తదితర ఏర్పాట్లను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. వ్యవసాయ,అనుబంధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ రైతు మహోత్సవానికి పక్కాగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట వ్యవసాయ కమిషనరేట్ నుండి హాజరైన ఏ.డీ.ఏ లు హుస్సేన్ బాబు,వినోద్ కుమార్,జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాజిద్ హుస్సేన్ తదితరులు ఉన్నారు.

# సన్న బియ్యం లబ్ధిదారులతో కలిసి భోజనం చేసిన రాష్ట్ర మైనార్టీస్ కమిషన్ చైర్మన్





**కబురు న్యూస్,నిజామాబాద్ టౌన్,ఏప్రిల్ 19 :**
నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని గౌతంనగర్ లో సన్న బియ్యం లబ్ధిదారుడైన దళిత వర్గానికి చెందిన లింబాద్రి,ఆయన కుటుంబ సభ్యులతో కలిసి రాష్ట్ర మైనార్టీస్ కమిషన్ చైర్మన్ తారిఖ్ అన్సారీ శనివారం సన్న బియ్యంతో వండిన అన్నంతో సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారుడిని,కుటుంబ సభ్యులను ఆప్యాయంగా పలకరించి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేస్తుండడం పట్ల లబ్ధిదారులు తమ హర్షాతిరేకాలు వెలిబుచ్చారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ,పేద,సామాన్య ప్రజలు కూడా సన్న బియ్యంతో కడుపు నిండా భోజనం చేయాలనే బృహత్తర సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు ప్రతీ నెల ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున సన్న బియ్యం అందిస్తుండడం ఎంతో గొప్ప విషయం అని అన్నారు. ప్రభుత్వ చారిత్రాత్మక నిర్ణయంతో నిరుపేదల్లో ఎంతో సంతోషం వ్యక్తం అవుతోందని అన్నారు. సన్న బియ్యం లబ్ధిదారుడు లింబాద్రి, అతని కుటుంబంతో కలిసి సహపంక్తి భోజనం చేయడం తనకు ఎంతో సంతృప్తి కలిగించిందని అన్నారు. సన్న బియ్యం పంపిణీ చేయాలని సాహసోపేత నిర్ణయం తీసుకుని విజయవంతంగా అమలు చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలకు ఈ సందర్భంగా మైనార్టీస్ కమిషన్ చైర్మన్ తారిఖ్ అన్సారీ అభినందనలు ప్రకటిస్తూ,హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన చంద్రశేఖర్ కాలనీలోని 31వ నెంబర్ రేషన్ దుకాణాన్ని సందర్శించి,లబ్దిదారులకు స్వయంగా సన్న బియ్యం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాలలో జిల్లా సాంఘిక సంక్షేమ అభివృద్ధి అధికారిణి నిర్మల,జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారిణి కృష్ణవేణి,జిల్లా పౌర సరఫరాల శాఖ డీ.టీ నిఖిల్,రేషన్ డీలర్ గంగామణి, డివిజన్ ఇంచార్జ్ షాకిర్,రేషన్ డీలర్ల సంఘం ప్రతినిధి పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

# న్యాయసేవల విస్తృతిలో న్యాయవాదుల అమోఘం










**కబురు న్యూస్,నిజామాబాద్ లీగల్,ఏప్రిల్ 19 :**
జిల్లా న్యాయసేవాధికార సంస్థ నిర్వహించిన ప్రతి కార్యక్రమంలో న్యాయావాదులు పోషించిన,సహకరించిన పాత్ర అమోఘమని సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి అన్నారు. నిజామాబాద్ బార్ అసోసియేషన్ జిల్లాకోర్టు ప్రాంగణంలోని సమావేశపు హాల్ లో బార్ అధ్యక్షుడు మామిల్ల సాయరెడ్డి అధ్యక్షత ఏర్పాటు చేసిన వీడ్కోలు సమేవేశంలో ఆమె మాట్లాడారు. ఉద్యోగరీత్యా బదిలీపై వచ్చానని,బదిలీపై వెళుతున్నానని వృత్తిరీత్యా పదవికి న్యాయం చేశామా లేదా ఆనేదే ప్రధానమని ఆమె తెలిపారు. న్యాయసేవ సంస్థ తరపున న్యాయసేవలు కక్షిదారులకు అందించడంలో అగ్రభాగాన నిలిచామని ఆమె పేర్కొన్నారు. బార్ ప్రధాన కార్యదర్శి మానిక్ రాజు మాట్లాడుతూ న్యాయవాదుల ప్రయోజనాలు ప్రణంగాపెట్టి లోక్ అదాలత్ లను విజయవంతం చేయడంలో క్రీయాశీలక భూమిక పోషించామని తెలిపారు. బదిలీపై వెళుతున్న జడ్జి పద్మావతి కి అధ్యక్ష,ప్రధాన కార్యదర్శి లు శాలువా,మెమోంటోతో వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా బార్ అధ్యక్షుడు సాయరెడ్డి ప్రసంగిస్తూ జడ్జిలు బదిలీపై ఉద్యోగరీత్యా వచ్చినప్పుడు ,బదిలీపై వెళుతున్నప్పుడు బార్ గౌరవనీయంగానే చూసుకుని వీడ్కోలు చెప్పే సంప్రదాయంలో పొరపాటుకు తావు ఇవ్వలేదని తెలిపారు. కార్యక్రమంలో బార్ ఉపాధ్యక్షుడు దిలీల్,సంయుక్త కార్యదర్శి ఝాన్సీరాణి, కోశాధికారి నారాయణ దాసు,లైబ్రరీ కార్యదర్శి శ్రీమాన్ ,న్యాయవాదులు పాల్గొన్నారు

# ప్రభుత్వ ఉపాధ్యాయులను సత్కరించిన ట్రస్మ సభ్యులు



**కబురు న్యూస్ బాన్సువాడ ఏప్రిల్ 19**

బాన్సువాడ ట్రాస్మా అసోసియేషన్ సభ్యులుగా ఉండి ప్రభుత్వ ఉపాధ్యాయులుగా ఉద్యోగాలు సాధించిన శ్యామ్ గౌడ్, మహేందర్ లను శనివారం ట్రాస్మా ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు రాజిరెడ్డి మాట్లాడుతూ ట్రాస్మా సభ్యులుగా ఉండి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం ఎంతో అభినందనీయమని, భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానానికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు పాశం రాజిరెడ్డి, ఉపాధ్యక్షుడు సాయిలు, పాల్గున్,షేక్ లడ్డు, యాదగిరి, జగన్, గణేష్, కిరణ్ సంతోష్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మిస్ వరల్డ్ పోటీలను రద్దు చేయాలి

**కబురు న్యూస్,నిజామాబాద్ టౌన్, ఏప్రిల్ 19 :**

తెలంగాణలో జరిగే 72వ మిస్ వరల్డ్ పోటీలను రద్దు చేయాలని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి సుజాత డిమాండ్ చేశారు.శనివారం నగరంలోని ఎన్ ఆర్.భవన్ కోటగల్లి నిజామాబాద్ లో మహిళ,విద్యార్థి,యువజన,ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మిస్ వరల్డ్ అందాల పోటీల వ్యతిరేక వేదిక సందర్భంగా రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి సుజాత,ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వి.గోదావరి, కే.సంధ్యారాణి,ఆకుల అరుణ మాట్లాడుతూ,తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కోట్ల రూపాయలు అప్పుగా తెచ్చి తెలంగాణ రాష్ట్రానికి అనవసరమైనటువంటి అందాల పోటీలకు ఖర్చు చేయడం దుర్మార్గమన్నారు.అందంగా ఉంటే ఆత్మవిశ్వాసం గుర్తింపు వస్తాయని అదే వ్యక్తిత్వమని అందాల పోటీల్లో ప్రచారం చేయడం స్త్రీ జాతికి అవమానకరమన్నారు.కార్పొరేటు వ్యాపారం



కొరకు స్త్రీని అంగట్లో సరుకుగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేయడం నీచమైన పని అన్నారు.భారతదేశంలో స్త్రీని దేవతల కొలిచే సంస్కృతి ఉందని, అటువంటి సంస్కృతి కాపాడుతున్నామని బిజెపి ప్రభుత్వం మిస్ వరల్డ్ అందాల పోటీలు తెలంగాణలో జరుగుతూ ఉంటే ఏమాత్రం వ్యతిరేకించకుండా నిశ్శబ్దంగా ఉండడం దేనికి సంకేతన్నారు.మహిళలలను మరింత లైంగిక హింసకు గురి చేయడానికే తప్ప ఇంకోటి కాదన్నారు.భారతీయ మహిళ స్త్రీల గౌరవం భంగపరిచే కార్యక్రమం జరుగుతుంటే విశ్వహిందూ పరిషత్,బజరంగ్ దళ్ సంస్థలు మౌనంగా ఎందుకు ఉన్నారన్నారు.అందుకే ఏ రాజకీయ పార్టీ అయినా పెట్టుబడిదారులతో కలిసి ప్రజలను దోపిడీకి చేయడం జరుగుతుందన్నారు.ప్రగతిశీల ఆలోచనలతో తెలంగాణలో జరిగే 72వ మిస్ వరల్డ్ పోటీలను రద్దు చేయుటకై కలిసికట్టుగా తెలంగాణ ప్రజానీకం ముందుండాలని కోరారు.ఈ కార్యక్రమంలో టియుసిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్, స్త్రీ విముక్తి మహిళా సంఘం నాయకులు పోసాని,అనసూయ, ప్రగతిశీల మహిళా సంఘం నాయకులు సత్యక్క,నాగమణి,సవిత,సంజన,అమూల్య, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షురాలు అంజలి,ట్రేడ్ యూనియన్ నాయకులు శివరాజు పిడిఎస్యు జిల్లా ప్రధాన కార్యదర్శులు డాక్టర్ కర్క గణేష్, జన్నారపు రాజేశ్వర్,సతీష్, మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

## చలో వరంగల్ బహిరంగ సభకు కార్యకర్తలు తరలి రావాలి...బారాస నాయకులు షేక్ జుబేర్



**కబురు న్యూస్ కోటగిరి ఏప్రిల్ 19**

బిఆర్ఎస్ పార్టీ వజ్రోత్సవ సభ ఈనెల 27న వరంగల్లో జరిగే బహిరంగ సభకు పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరుకావాలని బిఆర్ఎస్ పార్టీ నాయకులు మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ జుబేర్ అన్నారు. శనివారం కోటగిరి మండల కేంద్రంలో పార్టీ కార్యకర్తలతో ఆయన సమావేశమై వరంగల్ వజ్రోత్సవ సభకు హాజరయ్యే కార్యకర్తల వివరాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు కిషన్, సమీర్, నవీన్, దేవేంద్ర, రాజాగౌడ్, గంగారం, ఎజాస్,శ్రీధర్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కూకట్ పల్లి జర్నలిస్టులకు అండగా నిలిచిన వడ్డేపల్లి రాజు

- జర్నలిస్టుల సంక్షేమానికి కోటి విరాళం...
- తన జన్మదిన వేడుకల సందర్భంగా రూ.25 లక్షల చెక్కు అందజేత...
- అభినందించిన మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్...

**కబురు న్యూస్,కూకట్ పల్లి,ఏప్రిల్ 19 :**

నిత్యం ప్రజల పక్షాన పోరాటం చేసే జర్నలిస్ట్ యోధులకు కూకట్ పల్లి బిజెపి సీనియర్ నాయకులు,రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు అండగా నిలిచారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం,శాశ్వత నిధిని ఏర్పాటు చేసుకోవాలని సూచించిన ఆయన కోటి రూపాయల విరాళాన్ని ప్రకటించారు.శనివారం నిర్వహించిన వడ్డేపల్లి రాజు(రాజేశ్వరరావు)జన్మదిన వేడుకల సందర్భంగా రూ. 25 లక్షల చెక్కును మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్ ఆధ్వర్యంలో అందజేశారు.చాలీచాలని జీతాలతో ఇబ్బందులు పడుతున్న జర్నలిస్టులను చూసి



తాను చెల్లించానని ఈ సందర్భంగా తెలిపారు.తన సూచన మేరకు కూకట్పల్లిలోని సీనియర్ జర్నలిస్టులు ఏకతాటిపైకి వచ్చి కూకట్పల్లి జర్నలిస్టు మ్యూచువల్లీ ఎయిడెడ్ కోపరేటివ్ హౌసింగ్ సొసైటీని ఏర్పాటు చేసుకున్నారని హర్షం వ్యక్తం చేశారు.తాను ఇస్తున్న కోటి రూపాయలను జర్నలిస్టులు శాశ్వత అవసరాలైన భూమి కొనుగోలు కోసం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ సందర్భంగా మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్ జర్నలిస్టులకు అండగా నిలిచిన వడ్డేపల్లి రాజును అభినందించారు.నాయకులకు,జర్నలిస్టులకు ఎంతో విడదీయరాని బంధం ఉంటుందని ఈరోజు రాజు చేసిన పని మరింత బలోపేతం చేసిందని ఆశాభావం వ్యక్తం చేశారు. జర్నలిస్టులు తమ సొంత కుటుంబాలను సైతం వదిలేసి ప్రజల సమస్యలే పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తుంటారని కొనియాడారు. యాజమాన్యాల నుంచి వచ్చే జీతభత్యాలు అంతంతమాత్రంగానే ఉంటాయని అన్నారు. జర్నలిస్టులకు పెద్ద మొత్తంలో డబ్బులను అందజేసేందుకు ముందుకు వచ్చిన రాజు మనసు ఎంతో గొప్పది అన్నారు. భవిష్యత్తులో ఆయన మరిన్ని జన్మదిన వేడుకలు జరుపుకోవాలని జర్నలిస్టులకు అండగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హౌసింగ్ సొసైటీ అధ్యక్షులు గడ్డమీది బాలరాజు, ప్రధాన కార్యదర్శి దయాసాగర్, కోశాధికారి ఎం ఏ కరీం, సీనియర్ జర్నలిస్టులు తొట్ల పరమేష్, నిమ్మల శ్రీనివాస్, విద్యా వెంకట్, నవీన్ రెడ్డి, వేణుమాధవ్, మాణిక్య రెడ్డి, నాగరాజు, లక్ష్మణ్, హరి, దామోదర్, విష్ణు, రాము, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్, కల్తీ కల్లు పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.. డి.ఎస్.పి సుబ్బరామిరెడ్డి



- గ్రామాలలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేసిన అధికారులు

**కబురు న్యూస్ బాన్సువాడ ఏప్రిల్ 19**

గ్రామాలలో డ్రగ్స్, గంజాయి కల్తీకల్లు పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నార్కోటిక్ డిఎస్పి సుబ్బరామిరెడ్డి, ఎక్సైజ్ పోలీస్ సిఐలు యాదగిరి రెడ్డి, మండల అశోక్ అన్నారు. శనివారం బాన్సువాడ మండలంలోని దేశాయిపేట్,



ఇబ్రహీంపేట్,తాడ్కోల్ గ్రామాలలో డ్రగ్స్ ,గంజాయి, మత్తు పదార్థాలు, కల్తీ కల్లుపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు కల్తీ కల్లు, డ్రగ్స్, గంజాయి మత్తు పదార్థాల వల్ల ప్రజల అనారోగ్యం పాడు చేసుకోవద్దని, గంజాయి, మత్తు పదార్థాలు రవాణా చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ యాదగిరి రెడ్డి, సిఐ మండల అశోక్, ఎంపీడీవో బశిరుద్దిన్, డిఎల్పిఓ సత్యనారాయణరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు నవీన్ కుమార్, గీత, ప్రశాంతి, ఎక్సైజ్ సిబ్బంది, గ్రామస్తులు హన్మాండ్లు, నారాయణరెడ్డి, శ్రవణ్, బండి సాయిలు యాదవ్, పండరి, నవీన్ రెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# నేను చిందుల ఎల్లమ్మ ఆంగ్లానువాదం పుస్తకావిష్కరణ

**కబురు న్యూస్,నిజామాబాద్ టౌన్,ఏప్రిల్ 19 :**

నిజామాబాద్ జిల్లా వాసి ప్రజాకవి, ప్రముఖ రచయిత, అమరుడు డాక్టర్ ముత్యం రాసిన "నేను చిందులు ఎల్లమ్మ" అనే పుస్తకాన్ని తన కూతురు అయిన ప్రత్యూష యామిని ఆంగ్లంలో అనువదించారు. ఈ పుస్తకాన్ని రవీంద్రభారతి మినీ హాల్లో శనివారం చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య సూర్య ధనుంజయ్ ఆవిష్కరించారు. అనంతరం సభను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ డాక్టర్ ముత్యం తెలుగు సాహిత్యం పట్ల, ప్రజల పట్ల, అమితమైన ప్రేమ కలిగిన వారు. జానపద కళలను కాపాడుకోవాలని, అందులో చిందుల దృశ్యాన్ని, చిందుల ఎల్లమ్మ జీవిత



చరిత్రను పుస్తక రూపంలో తీసుకొచ్చారు. గ్రామీణ కళలను నిలబెట్టిన మహా వ్యక్తిగా ముత్యం కృషిని కొనియాడారు. ఆయన ఆలోచనల కొనసాగింపుగా తన కూతురు ప్రత్యూష యామిని తెలుగులో ఉన్న "నేను చిందుల ఎల్లమ్మ" అనే పుస్తకాన్ని ఆంగ్లానువాదం చేశారు. మనమందరం కుమారి ప్రత్యూష యామినిని అభినందించాలని కోరారు.ఈ సభలో ఎమ్మెల్సీ కోదండరాం, రాజేందర్,ప్రముఖ కవి నాళ్లేశ్వర శంకర్,పులికొండ సుబ్బాచారి, తుర్లపాటి లక్ష్మీ,శంకర్,వేల్పురు భూమయ్య,స్వయం ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.ఈ సభలో చిందుల ఎల్లమ్మ వారసుడైన చిందుల రాజేశ్వర్ టీం చిందుల కళారూపాన్ని విశేషంగా ప్రదర్శించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు..

## బడి బాట నిర్వహించిన ఉపాధ్యాయులు

**కబరు న్యూస్,ఏర్గట్ల,ఏప్రిల్ 19 :**

విద్యార్థులను ప్రభుత్వ పాఠశాల లో చేర్పించాలని మండలంలోని తోర్తి గ్రామ జడ్పి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సైలేందర్ అన్నారు.గ్రామ శివారులో జరుగుతున్న ఉపాధి హామీ పనుల వద్దకు వెళ్లి కూలీలతో మాట్లాడుతూ,శనివారం బడిబాట కార్యక్రమంలో భాగంగా తమ



పిల్ల లను ప్రభుత్వ పాఠశాల లో చేర్పించాలని ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా పాఠ్య పుస్తకాలు,నాణ్యమైన చదువు, ఉచిత భోజన,దుస్తుల సౌకర్యాలు ఉన్నాయని గ్రామ ప్రజలు తమ పిల్ల లను గ్రామంలోని ఉన్నత పాఠశాలకు పంపాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం,తదితరులు,పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమురయ్య...

**కబురు న్యూస్,నిజామాబాద్ టౌన్,ఏప్రిల్ 19 :**

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమురయ్య అన్నారు.ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో నగరంలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో శనివారం ఆత్మీయ అభినందన సభ నిర్వహించారు.ఇటీవల ఎమ్మెల్సీలుగా ప్రమాణం స్వీకారం చేసిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమురయ్య,గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అంజిరెడ్డి లను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మల్క కొమురయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయుల ఎలాంటి సమస్య ఉన్న తన దృష్టికి తీసుకురావాలని,ఉపాధ్యాయులు కోసం జిల్లా కేంద్రంలో త్వరలో ఆఫీస్ ఏర్పాటు చేస్తానని అన్నారు.రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఉద్యోగులకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని విస్మరించిందని, వెంటనే పెండింగ్ లో ఉన్న 5 డిఏ లు




విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పి ఆర్ సి అమలు చేయాలని,వేసవి సెలవులలో బదిలీలు ప్రమోషన్లు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ హామీ మేరకు నిరుద్యోగ భృతి అమలు చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో బిసి ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు మాడవేడి వినోద్ కుమార్,ప్రధాన కార్యదర్శి రాఘవాపురం గోపాలకృష్ణ,కార్యనిర్వాహక అధ్యక్షులు కంచరి రవికుమార్,కొట్టాల రామకృష్ణ,అసోసియేటడ్ అధ్యక్షులు ఎ మోహన్,గౌరవ అధ్యక్షులు కైరంకొండ బాబు,బిసిటియు మహిళా అధ్యక్షురాలు విజయలక్ష్మి,గౌరవ సలహాదారులు రమణ స్వామి,గంగోనె సంజీవ్,సతీష్,గంగయ్య,సత్యనారాయణ,స్వప్న తదితరులు పాల్గొన్నారు.

కబురు KABURU TELUGU DAILY


ఆదివారం ఏప్రిల్ 20 2025


# జెఈఈ మెయిన్స్ లో మెరిసిన వెక్టార్ కళాశాల విద్యార్థులు

**– వివిధ కేటగిరీలలో 25 మంది జేఈఈ అడ్వాన్స్ కు ఎంపిక...**

**కబురు న్యూస,నిజామాబాద్ స్పోర్ట్స్,ఏప్రిల్ 19 :** జేఈఈ మెయిన్స్ 2025 ఫలితాలు శనివారం ఫలితాలు ప్రకటించారు.ఈ ఫలితాలలో స్థానిక ఆర్య నగర్ లో గల వెక్టార్ జూనియర్ కళాశాల విద్యార్థులు మామిడి నిశాంత్ రెడ్డి ఆల్ ఇండియా1450 వ ర్యాంకు(99.26%) వినాయక్ జోషి(96.68%)తో ఆల్ ఇండియా 7054,చంద్రవదన్ రెడ్డి(96.38%) తో ఆల్ ఇండియా7696 వ ర్యాంకును సాధించి వెక్టార్ కళాశాల కీర్తిని చాటారు.ఓపెన్ కేటగిరి,ఓ బి సి కేటగిరి, ఈ డబ్ల్యూ ఎస్ కేటగిరి ఎస్సీ ఎస్టీ కేటగిరీలలో జేఈఈ అడ్వాన్స్ కు తమ కళాశాల నుంచి 25 మంది విద్యార్థులు ఎంపికైన సందర్భంగా విక్టర్ కళాశాల చైర్మన్ మధుసూదన్ జోషి అభినందనలు తెలియజేశారు.ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్లు సంతోష్,గజానంద్, కార్తీక్ లు హర్షం వ్యక్తం చేశారు.


మామిడి నిశాంత్ రెడ్డి (99.26%)ఎఐఆర్ 1450..


-వినాయక్ జోషి (96.68%)ఎఐఆర్ 7054..


-చంద్రవధన్ రెడ్డి(96.38%)ఏఐఆర్ 7696..

# కృతజ్ఞత సభను విజయవంతం చేయాలి



**కబురు న్యూస్,నిజామాబాద్ టౌన్, ఏప్రిల్ 19 :** రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ ఆధ్వర్యంలో న్యూ అంబేద్కర్ భవన్ లో ఆదివారం కృతజ్ఞత సభను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జమీల్లుల్లా కోరారు. శనివారం నగరంలోని కేర్ డిగ్రీ కళాశాలలో శనివారం సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు.కృతజ్ఞత సభ ఉదయం 10 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 2:00 గంటలకు ముగుస్తుందన్నారు.ఈ కృతజ్ఞత సభకు ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ అలీ షబ్బీర్,ఎమ్మెల్యేలు సుదర్శన్ రెడ్డి,భూపతిరెడ్డి,ఉర్దూ అకాడమిక్ చైర్మన్ తాహెర్ బిన్ హంధాన్ తదితర నాయకులు పాల్గొంటున్నారన్నారు. పదోన్నతులు పొందిన తెలుగు,హిందీ, ఉర్దూ ఉపాధ్యాయులందరూ హాజరై విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జమీల్లుల్లా, రమణ చారి,సతీష్ కుమార్ వ్యాస్, బి.ప్రవీణ్ కుమార్, పెంట శ్రీనివాస్ శాలి అరుణోదయలు కోరారు.

# భూ సమస్యల పరిష్కారానికే భూ భారతి చట్టం

**– అవగాహన సదస్సులో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు...**

**కబురు నిజామాబాద్,నిజామాబాద్, ఏప్రిల్ 19 :** భూ సంబంధిత సమస్యలను పరిష్కరిస్తూ, రైతుల భూములకు పూర్తి భరోసా కల్పించేందుకే ప్రభుత్వం నూతనంగా భూభారతి చట్టం తెచ్చిందని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అన్నారు.భూభారతి (భూమి హక్కుల రికార్డు చట్టం)-2025 పై శనివారం వర్ని , రుద్రూర్ రైతు వేదికలలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులలో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు,అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ హాజరయ్యారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,ప్రజల కోసం ప్రత్యేకించి రైతులకు వారి భూములకు సంబంధించి ఏవైనా వివాదాలు ఉంటే వాటిని తొలగించి,భూములపై పూర్తి హక్కులు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం భూభారతి చట్టాన్ని ప్రవేశపెట్టిందని అన్నారు.ధరణి పోర్టల్ లో లేని అనేక సమస్యలకు భూభారతి చట్టం ద్వారా పరిష్కారం లభించనుందని సూచించారు.ధరణిలోని వివరాల ప్రకారం భూభారతి రికార్డులలో వాటిని నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. అయితే, రైతులు తమ భూములకు సంబంధించిన సమస్యలపై అర్జీలు అందించవచ్చని సూచించారు.ధరణి వ్యవస్థ ఉన్నప్పుడు ఏదైనా అభ్యంతరం ఉంటే సివిల్ కోర్టుకు మాత్రమే వెళ్లాల్సి వచ్చేదని అన్నారు.భూ సమస్యలు పరిష్కరిస్తూ అధికారులు జారీ చేసిన ఉత్తర్వులపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే భూ భారతి చట్టం ప్రకారం అప్పీలు చేసుకునే అవకాశం కూడా ఉందని అన్నారు.తహసీల్దార్ స్థాయిలో దరఖాస్తు చేసుకుంటే న్యాయం జరగలేదని భావిస్తే ఆర్డీఓకు,అక్కడ కూడా సంతృప్తి చెందకపోతే కలెక్టర్ కు అప్పీల్ చేసుకోవచ్చని తెలిపారు.భూభారతి ద్వారా కింది స్థాయి అధికారులకు కూడా బాధ్యతలు అప్పగించారని, దీనివల్ల భూమికి సంబంధించిన చిన్నచిన్న సమస్యలు మండల స్థాయిలోనే సత్వరం పరిష్కారం అవుతాయని కలెక్టర్ అన్నారు.ధరణిలో సవరణకు, సమస్యల పరిష్కారానికి,కింది స్థాయి అధికారులకు ఎటువంటి అధికారాలు లేనందున వేల సంఖ్యలో దరఖాస్తులు పెండింగ్ ఉండేవని గుర్తు చేశారు.ధరణిలో భూ సమస్యలపై దరఖాస్తు చేసుకునేందుకు 33 మాడ్యూల్స్ ఉండడం వల్ల ఇబ్బందులు పడేవారని,భూభారతిలో కేవలం నాలుగు మాడ్యూల్స్ మాత్రమే ఉండి సులభమైన పద్ధతిలో దరఖాస్తు ప్రక్రియ ఉంటుందని అన్నారు.భూములకు సంబంధించిన అనేక సమస్యలకు భూభారతి చట్టం ద్వారా పరిష్కారం లభిస్తుందని, ఇదివరకటి ధరణిలో ఇలాంటి అవకాశం ఉండేది కాదన్నారు.భూభారతి చట్టం వల్ల రైతులకు, పేదలకు ఎంతో మేలు కలుగుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు.ప్రభుత్వం అన్ని కోణాలలో,మేధోమథనం చేసిన మీదట సమగ్ర అంశాలను పొందుపరుస్తూ భూభారతి చట్టానికి రూపకల్పన చేయడం జరిగిందన్నారు.భూ సమస్యలను నిర్దిష్ట గడువులోపు పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు.అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ,భూభారతి చట్టంలోని సెక్షన్లు,వాటి వివరాలపై రైతులకు సవివరంగా అవగాహన కల్పించారు.ఏదైనా సమస్య పరిష్కారం కాకుంటే భూభారతిలో అప్పీల్ వ్యవస్థ ఉందని, అప్పీలు చేసుకున్న పేద రైతులకు ఉచిత న్యాయ సహాయం అందిస్తారని అన్నారు.ఈ. చట్టం ద్వారా రైతులకు వారి భూముల వివరాలతో కూడిన ఆధార్ తరహాలో భూధార్ సంఖ్యను కేటాయిస్తారని తెలిపారు.భూ సమస్యలు తెలుసుకుని సులభతరంగా పరిష్కరించేందుకు ఈ చట్టం ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. వ్యవసాయ భూములతో పాటు వ్యవసాయేతర, మిగితా అన్ని రకాల భూముల రికార్డులు రెవెన్యూ కార్యాలయంలో నమోదు అయి ఉంటాయని అన్నారు.భూ వివరాలతో పాటు భూమి హద్దులతో కూడిన సర్వే మ్యాప్ పట్టా పాస్ పుస్తకానికి జత చేయబడుతుందని సూచించారు.అసైన్ మెంట్ భూములకు సంబంధించి కూడా త్వరలోనే ప్రభుత్వం సమగ్ర మార్గదర్శకాలను జారీ చేయనుందని తెలిపారు.అనంతరం ఆయా అంశాలపై రైతులు వెలిబుచ్చిన సందేహాలను కలెక్టర్, అదనపు కలెక్టర్ లు నివృత్తి చేశారు.భూభారతి చట్టంలో ఇంకా ఎలాంటి అంశాలు చేరిస్తే బాగుంటుందనే దానిపై రైతులు సలహాలు, సూచనలు చేయవచ్చని సూచించారు.ఈ సదస్సులలో బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో,ఏసీపీ శ్రీనివాస్, స్థానిక అధికారులు, రైతులు పాల్గొన్నారు.







# కలెక్టర్ ను కలిసిన టీజీఈజేఏసీ జిల్లా నూతన కార్యవర్గం



**కబురు న్యూస్,నిజామాబాద్ టౌన్,ఏప్రిల్ 19 :** టీజీఈజేఏసీ జిల్లా నూతన కార్యవర్గం శనివారం జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుని మర్యాదపూర్వకంగా కలిసింది.ఈ సందర్భంగా భవిష్యత్తులో చేపట్టబోయే కార్యక్రమాలను కలెక్టర్ కు వివరించామని కార్యవర్గ సభ్యులు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సుమన్,కన్వీనర్ కిషన్,రమణ్ రెడ్డి,ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు కృపాల్ సింగ్,రాము,మోహన్ రెడ్డి,కృష్ణా రెడ్డి, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఒలంపిక్స్ మెడల్స్ లక్ష్యంగా పెట్టుకోవాలి



**కబురు న్యూస్,నిజామాబాద్ టౌన్,ఏప్రిల్ 19 :** ఇందూరు జిల్లా క్రీడాకారులు ఒలంపిక్స్ మెడల్స్ లక్ష్యంగా పెట్టుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు.గిరిరాజ్ ప్రభుత్వ కళాశాలలో నిర్వహించిన క్రీడా వార్షికోత్సవం 2024-25 బహుమతుల ప్రదానోత్సవానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.ఇందూర్ జిల్లా అంటేనే క్రీడాకారులకు పెట్టిన పేరని జాతీయ,అంతర్జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులు ఉండటం జిల్లాకు గర్వకారణమన్నారు.యువత మాదకద్రవ్యల,మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని క్రీడల్లో నైపుణ్యం పెంచుకోవాలని సూచించారు.ఖేలో ఇండియా ఫిట్ ఇండియా పేరుతో గ్రామస్థాయి నుంచి క్రీడాకారులను కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహిస్తుందన్నారు.గిరిరాజా కళాశాల పూర్వవిద్యార్థిగా అర్బన్ ఎమ్మెల్యేగా కళాశాల అభివృద్ధికి తగిన నిధులు ప్రభుత్వం నుంచి వచ్చేలా కృషి చేస్తానన్నారు.అభివృద్ధి విషయంలో అవసరమైతే పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్,కాంగ్రెస్ నాయకులతో కలిసి పని చేస్తానన్నారు.అనంతరం వివిధ క్రీడా రంగాలలో,విజేతలుగా నిలిచినా క్రీడాకారులకు ఎమ్మెల్యే బహుమతులు అందించారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. రామ్మోహన్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ ఎస్ రంగా రత్నం, పీడీ డా. బాలమణి తదితరులు పాల్గొన్నారు.

# జెఈఈ మెయిన్స్ లో ఎస్ఆర్ కళాశాల విద్యార్థికి ఆల్ ఇండియా 98వ ర్యాంకు

**కబురు న్యూస్,నిజామాబాద్ స్పోర్ట్స్,ఏప్రిల్ 19 :** ఎన్ టిఎ శనివారం విడుదల చేసిన జెఈఈ మెయిన్స్ ఫలితాలలో నగరంలోని ఎస్ఆర్ కళాశాల విద్యార్థులు జెఈఈ మెయిన్స్ లో వివిద కేటగిరిలలో జాతీయ స్థాయి ర్యాంకులు సాధించారు.కళాశాలకు చెందిన బాదావత్ సురేష్ ఆల్ ఇండియా 98వ ర్యాంక్ (ఎస్టీ క్యాటగిరి),టి.ఆకాష్ 1813 ర్యాంక్,బి.సాయిపవన్ 3248 ర్యాంక్,సచిన్ 3333 ర్యాంక్,ఎల్.అఖిల 3828 ర్యాంక్,ఇపుల్ 4329 ర్యాంక్,శివసాయి 4721 ర్యాంక్,భరత్ 6839 ర్యాంక్,వాసు 6876 ర్యాంక్,అక్షద్ 8071 ర్యాంక్,సాయి చరణ్ 9873 ర్యాంక్,సంతోష్ 9972 ఇలా పదివేలలోపు 12 మంది విద్యార్థులు,20వేలలోపుని విద్యార్థులు 26మంది ర్యాంకులు సాధించగా,96మంది విద్యార్థులు జెఇఇ అడ్వాన్స్ కు అర్హత -సాదించినట్లు డీజీఎం గోవర్ధన్ రెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జాతీయస్థాయి ర్యాంకులు సాదించిన విద్యార్థులను అభినందించారు.ఈ సందర్భంగా జోనల్ ఇంచార్జి శ్రీకాంత్ మాట్లాడుతూ,అనుభవజ్ఞులైన అధ్యాపకులు,మెటీరియల్స్ ద్వారా జాతీయస్థాయి పరిక్షలైన ఐఐటిలకు సిద్దం చేస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ హన్మంతరావు,ఆరెందర్రెడ్డి,శ్రీధరరెడ్డి,దేవెందర్రెడ్డి,మహిపాల్ రెడ్డి,నర్సింహారెడ్డి,మురలీధర్, విద్యార్థులు,తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.





# సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తా

**కబురు న్యూస్,నిజామాబాద్ టౌన్,ఏప్రిల్ 19 :** తెలంగాణ ఉద్యోగులు,గెజిటెడ్ అధికారుల,ఉపాధ్యాయుల,కార్మిక,పెన్షనర్ల,సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని జిల్లా జాయింట్ యాక్షన్ కమిటీ కో - చైర్మన్ నర్సయ్య అన్నారు.గజిటేడ్ అధికారుల,ఉపాధ్యాయుల, కార్మిక,పెన్షనర్ల తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ నిజామాబాద్ జిల్లా కో - చైర్మన్ గా జిల్లా ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం అధ్యక్షులు నర్సయ్య ఎంపికైన సందర్భంగా శనివారం జిల్లా ఇంటర్ విద్య అధికారి కార్యాలయంలో సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్ విద్య అధికారి రవికుమార్ తో పాటు ప్రిన్సిపాల్ ల సంఘం అధ్యక్షులు చిన్నయ్య, ఉపాధ్యక్షులు బుద్ధిరాజ్, ప్రధాన కార్యదర్శి చంద్ర విఠల్,శ్రీనాథ్,రజియుద్దిన్ అస్లాం,నారాయణ,ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం ఉపాధ్యక్షులు జాఫర్,ప్రధాన కార్యదర్శి నారాయణలు సన్మానం చేశారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సురేష్ బాబు,రవి,ప్రకాష్,తులసీదాస్,శంకర్ లు పాల్గొన్నారు.



# షకీల్ ను పరామర్శించిన సురేందర్ రెడ్డి...

**కబురు న్యూస్, బోధన్ ఏప్రిల్ 19..** బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ ఆమెర్ ను పోచారం సురేందర్ రెడ్డి పరామర్శించారు. శనివారం బోధన్ పట్టణలోని మాజీ ఎమ్మెల్యే షకీల్ నివాసంలో షకీల్ ను బాన్సువాడ నాయకులు పోచారం సురేందర్ రెడ్డి పరామర్శించారు.



# రెడ్డిపెల్లి లో అలరించిన ప్రీ స్కూల్ మేళ...

**- అంగన్వాడి కేంద్రాలు.. మహిళల ఆరోగ్యానికి వరాలు..**

**- ఐసిడిఎస్ సూపర్వైజర్ రమాదేవి...**



కబురు న్యూస్,వీణవంక,ఏప్రిల్ 19:

వీణవంక మండలం రెడ్డిపల్లి గ్రామంలో అంగన్వాడి సెంటర్-1, అంగన్వాడి సెంటర్ -2 లు సంయుక్తంగా కలిసి, అంగన్వాడి సెంటర్ -1 లో శనివారం ప్రీ స్కూల్ మేళ కన్నుల పండుగగా ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వీణవంక సెక్టార్ సూపర్వైజర్ రమాదేవి హాజరై మాట్లాడుతూ..మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గర్భిణీలకు , బాలింతలకు, అంగన్వాడి ప్రీ స్కూల్ పిల్లల (3 నుండి 6 సంవత్సరాలు )అభివృద్ధికై అనేక కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని, పుట్టిన బిడ్డ నుండి ఆరు సంవత్సరాల పిల్లల వరకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా ఉచిత పౌష్టికాహారాన్ని అందించడం జరుగుతుందని, కార్యక్రమంలో భాగంగా అన్నప్రాసన, శ్రీమంతాలు, బర్త్డే లు చేయటం జరుగుతుందని,అలాగే గర్భిణీలకు, బాలింతలకు, పిల్లలకు పోషకాహార లోపం లేకుండా గుడ్లు, పాలు, బాలామృతం, పోషక విలువలు కలిగిన భోజనం,కురుకురేలు అందిస్తూ, ఆరోగ్యవంతులుగా మారుస్తున్నామని, ప్రీస్కూల్ పిల్లలకు స్కూల్ యూనిఫామ్ ఇవ్వడం జరిగిందని, ప్రత్యేకించి ప్రీస్కూల్ పిల్లలకు అసెస్మెంట్ కార్డులను ఇవ్వడం జరుగుతుందని, అంగన్వాడి కేంద్రాలలో పిల్లలందరూ చురుకుగా తయారయ్యారని, పిల్లల్లో పోషకాహార నివారణకు అంగన్వాడీ కేంద్రాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని, అనారోగ్య సమస్యలకు కూడా ఆర్ బి ఎస్ కే వారి సహకారంతో ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని,అంగన్వాడి కేంద్రాలు గర్భిణీలకు, బాలింతలకు, ప్రీస్కూల్ పిల్లలకు వరంగా మారాయన్నారు. ఈ కార్యక్రమంలో ఓ దాత అంగన్వాడి కేంద్రంలో పిల్లలకు కుర్చీలను విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు ప్రశాంత, సరిత, గర్భిణీలు, బాలింతలు,ఆయా సెంటర్ల ప్రీస్కూల్ విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మీయ సన్మాన సభ

- ఐ ఎన్ టి యు సి ఫెడరేషన్ నూతన అధ్యక్షుడు శ్రీనివాస్ కి ఘన సన్మా నం..



కబురు న్యూస్, జమ్మికుంట ఏప్రిల్ 19:

కరీంనగర్ జిల్లా ఐ ఎన్ టి యు సి ఫెడరేషన్ నూతన అధ్యక్షుడిగా నియామకమైన అంబాల శ్రీనివాస్ ను కరీంనగర్ లో ఘనంగా సన్మానించడం జరిగింది. ఆర్ఎంపీ డాక్టర్ అసోసియేషన్ మరియు కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అంబాల శ్రీనివాసు కి అభినందనలు తెలియజేశారు. మరియు ఆత్మీయ సన్మాన సభకు ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ మురహరి బుద్దారం, ఐ ఎన్ టి యు సి ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు , ముఖ్య అతిథులుగా రావడం జరిగింది.శ్రీనివాస్ ని ఘనంగా సన్మానం చేసి, ప్రశంసలు తెలియజేశారు. అలాగే ఇ కార్యక్రమం లో వర్కింగ్ ప్రెసిడెంట్ మణికంఠ, ఉపాధ్యక్షులు రాజు, మహిళా విభాగం అధ్యక్షులు మన్నే శరణ్య రెడ్డి, ఆర్.ఎం.పి డాక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, ఆర్.ఎం.పి డాక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శంకర్, మరియు కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# గాలివాన బాధిత రైతులను పంటలను సందర్శించిన కోరుట్ల ఎమ్మెల్యే

- ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి..ఎమ్మెల్యే సంజయ్











కబురు న్యూస్,కోరుట్ల ఏప్రిల్ 19:

కోరుట్ల నియోజకవర్గంలోని ఇబ్రహీంపట్నం,ఎర్దండి, కోజన్ కొత్తూర్,కేశవపూర్ మరియు ముత్యంపేట గ్రామాల్లో వడగండ్ల వానతో మరియు ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలతో పంట నష్టం జరిగిన పొలాలను కోరుట్ల ఎమ్మెల్యే డా.సంజయ్ పరిశీలించారు.

- ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ

పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి 25 వేల రూపాయల ఆర్థిక సహాయం చేసి రైతన్నలను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. నియోజకవర్గంలో వడగండ్ల వానకు తీవ్ర పంట నష్టం జరిగిందని, రైతులు చాలా ఆందోళన చెందుతున్నారని అన్నారు. ఇప్పటికీ రైతులకు రైతు భరోసా రాలేదు, రుణమాఫీ కాలేదు కాబట్టి కనీసం నష్ట పరిహారమైన ఇచ్చి రైతన్నను ఆదుకోవాలని విజ్ఞప్తి చేసారు.జరిగిన నష్టాన్ని వ్యవసాయ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ రఘునందన్ గారికి ఫోన్ లో వివరించి, రైతులను ఆదుకోవాలని కోరారు.పంట నష్ట వివరాలను సర్వే చేసి వెంటనే ఉన్నతాధికారులకు పంపాలని మండల వ్యవసాయ అధికారులకు విజ్ఞప్తి చేసారు.పంటల భీమా హామీ ఇచ్చి, బడ్జెట్ లో నిధులు కేటాయించి పంటల బీమా చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు తీవ్ర అన్యాయం చేసిందని, ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఇది నిదర్శనమని అన్నారు. రైతులకు రైతు రైతుబంధు పడలేదు, రుణమాఫీ కాలేదు పైగా వడగండ్ల వానకు పంట నష్టపోయిందని తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు కాబట్టి, రైతులకు ప్రభుత్వం అండగా ఉండాలని ప్రభుత్వాన్ని కోరారు.రైతులు నష్ట పోకుండ పోరాడుతానని, రైతులు ధైర్యంగా ఉండాలని పంట నష్టపోయిన రైతులకు భరోసానిచ్చారు.ఈ పర్యటనలో ఎమ్మెల్యే గారితో పాటు డిఏవో, ఎమ్మార్వో, ఏవో, ఏఈఓ, ఎలక్ట్రిసిటీ అధికారులు, ఇతర అనధికారులు, నాయకులు పాల్గొన్నారు..

# డ్రగ్స్ నిర్మూలన పోరు యాత్ర గోడపత్రిక ఆవిష్కరణ



కబురు న్యూస్, భీమదేవరపల్లి ఏప్రిల్ 19:

మండల కేంద్రంలోనీ మహిళా సమాఖ్య భవనంలో జేఏసీ మరియు మహిళా సంఘాల ఆధ్వర్యంలో డ్రగ్స్ నివారణ పోరు యాత్ర గోడపత్రిక ఆవిష్కరించడం జరిగింది. తేదీ 21 ఏప్రిల్ 2025 సోమవారం రోజున మాణిక్యపూర్ గ్రామంలో డ్రగ్స్ నిర్మూలన పోరుయాత్ర జరుగనున్నందున ఈరోజు వాల్ పోస్టర్ విడుదల చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి గౌరవ బీసీ సంక్షేమ శాఖ మరియు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం రావడం జరుగుతుందన్నారు.మహిళా సంఘాలు, ప్రజా సంఘాలు,దళిత బహుజన సంఘాలు,డ్రగ్స్ నిర్మూలన కోరుకునే ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని పోరి యాత్రను విజయవంతం చేయాలని కోరడమైనది. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ నియోజకవర్గం జేఏసీ చైర్మన్ కవ్వ లక్ష్మారెడ్డి, భీమదేవరపల్లి జేఏసీ చైర్మన్ డ్యాగల సారయ్య,తహసిల్దార్ ప్రవీణ్ కుమార్,ఎంఈఓ సునీత,ఎంపీడీవో వీరేశం ఏపిఓ దేవానందం, ముల్కనూర్ ఎస్సై సాయిబాబు,డాక్టర్ సుధాకర్ డ్రగ్స్ నిర్మూలన పోరుయాత్ర కోఆర్డినేటర్ చెప్యాల ప్రకాష్,ఉప్పుల కుమారస్వామి,గాండ్ల పద్మ, మహిళా సమాఖ్య ఎండి షబానా కోఆర్డినేటర్, మేకల వీరన్న యాదవ్ లక్ష్మణ్ గౌడ్, దండు లక్ష్మి, మాజీ మహిళా అధ్యక్షురాలు రజిత,ఎర్ర కార్తీక్,వేముల జగదీష్ తదితరులు పాల్గొనడం జరిగింది.

# తెలంగాణ ప్రజా ఫ్రంట్ ఉమ్మడి జిల్లాల మహాసభల కరపత్ర ఆవిష్కరణ



కబురు న్యూస్, భీమదేవరపల్లి ఏప్రిల్ 19

మండల కేంద్రంలోని ముల్కనూర్ అంబేద్కర్ కూడలిలో రేపు 20వ తేదీన హనుమకొండ ప్రెస్ క్లబ్ లో జరిగే హనుమకొండ వరంగల్ జిల్లా 4గవ మహాసభలను విజయవంతం చేయాలని కరపత్ర ఆవిష్కరణ చేయడం జరిగినది. ఈ సందర్భంగా తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర కో- కన్వీనర్ గొల్లూరి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ఈ సభకు బుద్ధి జీవులు, మేధావులు, విద్యార్థి సంఘాల నాయకులు, ప్రజా సంఘాలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని సభలను విజయవంతం చేయాలని కోరడమైనది. ఈ కార్యక్రమంలో టీ పీఎఫ్ కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి అయిందాల అంజన్న, తెలంగాణ రైతాంగ సమితి సహాయ కార్యదర్శి కొత్తూరి ఇంద్రసేన, తెలంగాణ డప్పు కళాకారుల రాష్ట్ర అధ్యక్షుడు తాళ్లపల్లి జగన్, పౌర హక్కుల సంఘం కరీంనగర్ జిల్లా కార్యదర్శి గడ్డం సంజీవ్, రైతు నాయకులు తొగరి ఐలయ్య, సన్నపు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# రాబోయే పది రోజులు తెలంగాణాలో మండే ఎండలు




కబురు న్యూస్, హైద్రాబాద్ ఏప్రిల్ 19:

**- రాబోయే పది రోజులు తెలంగాణలో ఎండలు దంచికొడతాయని వాతావరణ నిపుణులు అంచనా వేశారు.**

**- ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో**

ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఈ ఎండల ప్రభావం ఎక్కువగా ఉంటుందని తెలిపారు.ఏప్రిల్ 30 వరకు గరిష్ఠ ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల వరకు నమోదు అవుతాయని హెచ్చరించారు.హైదరాబాద్ నగరంలో 40-42 డిగ్రీల ఉష్ణోగ్రతలు రికార్డయ్యే అవకాశం ఉందన్నారు. అదే సమయంలో అకాల వర్షాలు కురుస్తాయని పేర్కొన్నారు.ఈ హెచ్చరికతో అందరూ జాగ్రత్తలు పాటించాలని ఆరోగ్య నిపుణుల సలహా.ఎండల్లో తిరుగుతూ అతి చల్లని కూల్ డ్రింక్స్ గానీ, ఐస్ ఎక్కువగా వేసిన ఫ్రూట్ జ్యూస్ గానీ తాగకూడదని చెబుతున్నారు.

**- జాగ్రత్తలు తీసుకోండి**

బయట వేడిగా ఉందని, అతి చల్లని డ్రింక్స్ ఏవి తాగినా వెంటనే శరీరంపై ప్రభావం చూపి కడుపులో తిప్పడం ప్రారంభమవుతుందంటున్నారు.ఇలా ఉష్ణోగ్రతల తారతమ్యాలతో శరీరం అదుపు తప్పి నడుస్తూ పడిపోయే ప్రమాదాలున్నాయని డాక్టర్లు సూచిస్తున్నారు.అతి చల్లని పదార్థాలు సేవించి,వెంటనే వాహనాలు నడిపే వారు శరీరం అదుపు తప్పి ప్రమాదాల పాలయ్యే అవకాశాలుంటాయి అంటున్నారు ఆరోగ్య నిపుణులు.

# జమ్మికుంట సప్తగిరి హాస్పిటల్ సీజ్

**సీఎంఆర్ఎఫ్ స్కామ్ ...**

**ట్రీట్మెంట్ చేయకుండానే నకిలీ బిల్లులు**

**గతేడాది హాస్పిటల్ పై కేసు నమోదు చేసిన సీఐడీ**

**అక్రమాలు నిజమేనని తేలడంతో రిజిస్ట్రేషన్లు రద్దు**

**నోటీసులు జారీ చేసిన డిప్యూటీ డిఎంహెచ్వో**



రోగులకు చికిత్స చేయకుండానే, చేసినట్టుగా నకిలీ బిల్లులు సృష్టించి సీఎం రిలీఫ్ ఫండ్ కాజేసిన వ్యవహారంలో కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలోని సప్తగిరి హాస్పటల్ ని డిప్యూటీ డిఎంహెచ్వో చందు నోటీసులు జారి చేసి లైసెన్స్లు రద్దు చేసి, ఆసుపత్రిని సీజ్ చేశారు. పట్టణంలోని సప్తగిరి ఆసుపత్రి లో వైద్యము చేయకుండానే వైద్యము చేసినట్లు పేషంట్ల పేరిట దొంగ బిల్లులు సృష్టించి సీఎంఆర్ఎఫ్ రిలీఫ్ ఫండ్ దరఖాస్తు చేశారు.సీఎం ఆర్ ఎఫ్ దరఖాస్తు చేస్తున్న కొందరు పేషంట్ల బిల్లులపై అనుమానం రావడంతో 2023 సెప్టెంబర్ లో ఉద్యోగులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుల ఆధారంగా ప్రాథమికంగా విచారణ చేసిన పోలీసులకు జిల్లాలో ఎటువంటి వ్యవహారాలు జరిగాయని గుర్తించి , ఈ కేసును సిఐడి కి బదిలీ చేయగా, అధికారులు వారి స్థాయిలో ఎంక్వయిరీ చేసి ఆసుపత్రి సిబ్బందిని ప్రశ్నించడంతో పాటు పలు పేపర్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ బిల్లులు కాజేసిన ఆసుపత్రిలపై చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేయడంతో, జిల్లా ఉన్నతాధికారుల ఫిర్యాదు మేరకు హుజురాబాద్ డిప్యూటీ డిఎంహెచ్వో చందు జమ్మికుంట పట్టణంలోని సప్తగిరి ఆసుపత్రికి నోటీసులను జారీ చేశారు. శనివారం జమ్మికుంట పట్టణంలోని సప్తగిరి ఆసుపత్రిలో వైద్య సేవలు అందిస్తున్నారా లేరా అని గుర్తించి ఆసుపత్రి యొక్క లైసెన్స్ ను రద్దు చేయడంతో పాటు ఇకనుండి ఆసుపత్రిలో ఎలాంటి సేవలు అందించ కూడదని ఒకవేళ అందించి నట్లయితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని నిర్వాహకులను హెచ్చరించినట్లు సమాచారం.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎంపీ నామ

కబురు న్యూస్, హైదరాబాద్ ఏప్రిల్ 19:

హైదరాబాద్ శంకరపల్లి వాస్తవ్యులు ఉడతనేని మధుసూదనరావు-జ్యోతిశ్రీల కుమారుడు వికాస్ చౌదరి వివాహం, ఖమ్మం జిల్లా సత్తుపల్లి పట్టణానికి చెందిన బొప్పన ఖాదర్ బాబు-ఉమాజ్యోతి ల కుమార్తె నాగప్రియతో శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో అత్యంత వైభవంగా జరిగింది. ఈ వేడుకకు బీఆర్ఎస్ పార్టీ మాజీ లోక్ సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు హాజరై, నూతన వధూవరులను నిండు నూరేళ్లు అన్యోన్యంగా కలిసి సంతోషంగా దాంపత్య జీవితం సాగించాలని, అష్టైశ్వర్యాలు సుఖ, సంతోషాలతో జీవించాలని ఆశీర్వదించారు. వధూవరులకు ఉజ్వల భవిష్యత్తు కోరుతూ హృదయపూర్వక వివాహ మహోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

# పోరాడి ఓడిన రాజస్థాన్..

## రెండు పరుగుల తేడాతో లఖ్‌నవూ విజయం



రాజస్థాన్ రాయల్స్ మరోసారి గెలుపు ముంగిట బోల్తాపడింది. దిల్లీతో మ్యాచ్‌లో సూపర్ ఓవర్‌లో ఓటమిపాలైన ఆ జట్టు.. లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ తో జరిగిన మ్యాచ్‌లో రెండు పరుగుల తేడాతో పరాజయం చవిచూసింది. తొలుత బ్యాటింగ్ చేసిన లఖ్‌నవూ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 180 పరుగులు చేసింది. లక్ష్యఛేదనలో రాజస్థాన్ 5 వికెట్లు కోల్పోయి 178 పరుగులు చేసింది. యశస్వి జైస్వాల్ (74బీ 52 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్స్‌లు), అరంగేట్ర ఆటగాడు వైభవ్ సూర్యవంశీ (34బీ 20 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లు), రియాన్ పరాగ్ (39బీ 26 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) మెరవడంతో సునాయసంగా విజయం సాధించేలా కనిపించింది. లఖ్‌నవూ పేసర్ అవేశ్ ఖాన్ తన చివరి రెండు ఓవర్లలో అద్భుతంగా బౌలింగ్ చేశాడు. 18 ఓవర్‌లో జైస్వాల్, రియాన్ పరాగ్‌ను ఔట్ చేసి మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. ఆఖరి ఓవర్‌లో రాజస్థాన్ విజయానికి 9 పరుగులు అవసరం కాగా.. అవేశ్ 6 పరుగులే ఇచ్చి హెట్‌మయర్ (12)ను ఔట్ చేశాడు. శార్దూల్ ఠాకూర్, మార్‌క్రమ్ చెరో వికెట్ తీశారు. లఖ్‌నవూకు ఇది ఐదో విజయం కాగా.. రాజస్థాన్‌కు వరుసగా నాలుగో ఓటమి.

తొలుత బ్యాటింగ్ చేసిన లఖ్‌నవూ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 180 పరుగులు చేసింది. ఓపెనర్ ఐడెన్ మార్‌క్రమ్ (66బీ 45 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్స్‌లు), మిడిల్ ఆర్డర్ బ్యాటర్ ఆయుష్ బదోని (50బీ 34 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ శతకాలు బాదారు. ఇన్నింగ్స్ చివరి ఓవర్‌లో అబ్దుల్ సమద్ (30లిబీ 10 బంతుల్లో) నాలుగు సిక్స్‌లు బాదడంతో స్కోరు 180కి చేరింది. మిచెల్ మార్ష్ (4), నికోలస్ పూరన్ (11), రిషభ్ పంత్ (3) విఫలమయ్యారు. ఈ క్రమంలో మార్‌క్రమ్, బదోని జోడీ నాలుగో వికెట్‌కు 76 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. మార్‌క్రమ్ 31 బంతుల్లో అర్ధ శతకం పూర్తి చేసుకున్నాడు. 33 బంతుల్లో హాఫ్ సెంచరీ అందుకున్న బదోని.. తర్వాత బంతికే ఔటయ్యాడు. రాజస్థాన్ రాయల్స్ బౌలర్లలో వానిందు హసరంగ 2, జోఫ్రా ఆర్చర్, సందీప్ శర్మ, తుషార్ దేశ్‌పాండే ఒక్కో వికెట్ పడగొట్టారు.

# గుజరాత్ థ్రిల్లింగ్ విక్టరీ.. విధ్వంసకర ఇన్నింగ్స్‌తో ఢిల్లీకి చెక్ పెట్టిన బట్లర్



ఐపీఎల్ 2025 లో గుజరాత్ టైటాన్స్ మరో కీలక విజయాన్ని నమోదు చేసుకుంది. సొంతగడ్డపై టేబుల్ టాపర్స్ ఢిల్లీ క్యాపిటల్స్ పై ఘన విజయం సాధించింది. శనివారం (ఏప్రిల్ 19) అహ్మదాబాద్ లోని నరేంద్ర మోడీ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్ లో ఢిల్లీపై 7 వికెట్ల తేడాతో థ్రిల్లింగ్ విక్టరీ కొట్టింది. భారీ ఛేజింగ్ లో జోస్ బట్లర్ (54 బంతుల్లో 97: 11 ఫోర్లు, 4 సిక్సర్లు) విధ్వంసకర ఇన్నింగ్స్ కు తోడు రూథర్ ఫోర్డ్ (43), సాయి సుదర్శన్ (36) విలువైన ఇన్నింగ్స్ ఆడారు. మొదట బ్యాటింగ్ చేసిన ఢిల్లీ క్యాపిటల్స్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 203 పరుగులు భారీ స్కోర్ చేసింది. లక్ష్య ఛేదనలో ఢిల్లీ 19.2 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి 204 పరుగులు చేసి గెలిచింది.204 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో గుజరాత్ కు ఆరంభంలోనే బిగ్ షాక్ తగిలింది. రెండో ఓవర్ లో కరుణ్ నాయర్ వేసిన అద్భుత త్రో కారణంగా కెప్టెన్ శుభమాన్ గిల్ (7) ఔటయ్యాడు. ఈ దశలో కెప్టెన్ బట్లర్, సాయి సుదర్శన్ గుజరాత్ ఇన్నింగ్స్ ను ముందుకు తీసుకెళ్లారు. ఓ వైపు వికెట్ కాపాడుకుంటూనే మరోవైపు వేగంగా పరుగులు చేశారు. వీరిద్దరి ధాటికి పవర్ ప్లే లో గుజరాత్ వికెట్ నష్టానికి 67 పరుగులు చేసింది.పవర్ ప్లే తర్వాత కుల్దీప్ యాదవ్ జోరు మీదున్న సాయి సుదర్శన్ (36) ను పెవిలియన్ కు పంపి మ్యాచ్ ను ఆసక్తికరంగా మార్చేశాడు. అయితే బట్లర్, రూథర్ ఫోర్డ్ ఢిల్లీ బౌలర్లను ఒక ఆటాడుకున్నారు. ఇద్దరూ భారీ షాట్లతో చెలరేగడంతో మ్యాచ్ గుజరాత్ వైపు మళ్లింది. స్టార్క్ వేసిన ఇన్నింగ్స్ 15 ఓవర్లో బట్లర్ వరుసగా ఐదు ఫోర్లు బాదడంతో మ్యాచ్ పూర్తిగా గుజరాత్ చేతుల్లోకి వచ్చింది. జట్టు విజయం కోసం చివరి వరకు క్రీజ్ లో ఉన్న బట్లర్ సెంచరీ చేసుకోలేకపోయాడు. చివరి ఓవర్లో 10 పరుగులు కావాల్సిన దశలో టివాటియా సిక్సర్, ఫోర్ కొట్టి మ్యాచ్ ను ఫినిష్ చేశాడు. ఢిల్లీ బౌలర్లలో కుల్దీప్ యాదవ్, ముకేశ్ కుమార్ లకు తలో వికెట్ దక్కింది.

అంతకముందు మొదట బ్యాటింగ్ చేసిన ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్ అక్షర్ పటేల్ (32 బంతుల్లో 39: ఫోర్, 2 సిక్సర్లు) కెప్టెన్ ఇన్నింగ్స్ కు తోడు మిగిలిన వారు సమిష్టిగా రాణించడంతో నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 203 పరుగులు భారీ స్కోర్ చేసింది. 39 పరుగులు చేసి అక్షర్ పటేల్ టాప్ స్కోరర్ గా నిలిచాడు. గుజరాత్ బౌలర్లలో ప్రసిద్ కృష్ణ నాలుగు వికెట్లు పడగొట్టాడు. అర్షద్ ఖాన్, మహమ్మద్ సిరాజ్, సాయి కిషోర్, ఇషాంత్ శర్మ తలో వికెట్ తీసుకున్నారు.

## ప్లే ఆఫ్ రేసులో సన్ రైజర్స్ ఆశలు ఆవిరేనా..!

ఐపీఎల్ 18వ సీజన్ 2025లో సన్ రైజర్స్ తొలి మ్యాచ్‌ను ఘనంగా ప్రారంభించి అంచనాలను అమాంతం పెంచింది. ఈ సీజన్లో ఆడిన తొలి మ్యాచ్ లోనే ఐపీఎల్ లో రెండో అత్యధిక స్కోరును నమోదు చేసింది. ఆ తర్వాతి మ్యాచుల్లో మాత్రం అదే జోరును కొనసాగించ లేకపోయింది. ఇప్పటివరకు 7 మ్యాచులు ఆడిన, కేవలం 2 మ్యాచులు మాత్రమే గెలిచింది.పాయింట్ల పట్టికలోనూ చివరి రెండో స్థానంలో కొనసాగుతోంది. 10 కోట్లు పెట్టి షమీని కొనుగోలు చేసినా ఉపయోగం లేకుండా పోయింది. 11.75 కోట్లు పెట్టి కొనుగోలు చేసినా ఇషాంత్ కిషన్, తొలి మ్యాచ్ మినహాయిస్తే వరుసగా విఫలమవుతూ వస్తున్నాడు. గత సీజన్లో అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడి, సన్ రైజర్స్ ఫైనల్ దాకా చేరుకుంది. కానీ ఈ సీజన్లో ప్లే ఆఫ్ దశకు చేరకుండానే సీజన్ నుంచి ఇంటిబాట పట్టే అవకాశాలు కనపడుతున్నాయి.


## 20 ఫోర్లు, 5 సిక్సర్లతో ఊహకందని ఊచకోత.. ఇంగ్లాండ్ క్రికెటర్ జేమ్స్ విన్స్ పరుగుల వరద



పాకిస్తాన్ క్రికెట్ లీగ్‌లో ఇంగ్లాండ్ క్రికెటర్ జేమ్స్ విన్స్ పరుగుల వరద పారిస్తున్నాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో సరైన అవకాశాలు దక్కించుకోలేకపోయిన ఈ క్రికెటర్.. ఫ్రాంచైజీ క్రికెట్‌లో తనదైన ముద్ర వేస్తున్నాడు. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, ఇంగ్లాండ్, అబుదాబీ, బంగ్లాదేశ్ టీ20 లీగ్‌లలో ఆడుతోన్న విన్స్.. పాకిస్తాన్ క్రికెట్ లీగ్‌లో కరాచీ కింగ్స్‌కి ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. ప్రస్తుతం పీఎస్‌ఎల్ టోర్నీ జరుగుతోంది. ఇందులో కరాచీ కింగ్స్ ఇప్పటివరకు మూడు మ్యాచ్‌లు ఆడగా.. అందులో ఒకదానిలో ఓడిపోయి.. రెండు మ్యాచ్‌లలో విజయం సాధించింది. ఇక ఈ రెండు విజయాల్లోనూ జేమ్స్ విన్స్ కీలక పాత్ర పోషించాడు.ముల్తాన్ సుల్తాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో జేమ్స్ విన్స్ కిర్రాక్ సెంచరీ(101)తో అదరగొట్టగా.. క్వెట్టా గ్లాడియేటర్స్‌తో మ్యాచ్‌లో 70 పరుగులతో రాణించాడు. ఇక అత్యధిక రన్‌స్కోరర్‌లో రెండో స్థానంలో నిలిచాడు జేమ్స్ విన్స్.. మొత్తంగా 3 మ్యాచ్‌లలో 20 ఫోర్లు, 5 సిక్సర్లతో 171 పరుగులు చేశాడు. ఐపీఎల్‌లో జేమ్స్ విన్స్‌ను ఏ జట్టు కొనుగోలు చేయలేదు. కానీ ఇతర ఫ్రాంచైజీ లీగ్‌లలో మాత్రం జేమ్స్ విన్స్ తన సత్తా చాటుతున్నాడు. వరుసగా అద్భుత పెర్ఫార్మెన్స్‌లు చేస్తూ.. తమ జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నాడు. కాగా, ఈ ఏడాది జేమ్స్ విన్స్‌ను కరాచీ కింగ్స్ 1,04,866 డాలర్లకు కొనుగోలు చేసింది.

# బ్యాటింగ్ విభాగం విఫలమైంది

## ఆర్‌సిబి కెప్టెన్ రజత్ పాటిదార్ తీవ్ర అసంతృప్తి



ఆర్‌సిబి కెప్టెన్ రజత్ పాటిదార్ బ్యాటింగ్ విభాగం విఫలమైందని పేర్కొంటూ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు. బౌలింగ్ యూనిట్ అద్భుతంగా రాణించినా, బ్యాటర్లు తగిన స్థాయిలో స్పందించకపోవడం వల్ల ఓటమి తప్పలేదని అన్నాడు. బెంగళూరులో వరుసగా మూడో ఓటమిని చవిచూసిన ఆర్‌సిబి ప్లే ఆఫ్స్ అవకాశాలను మరింత సంక్లిష్టం చేసుకుంది. అభిమానులు జట్టు పుంజుకోవాలని ఆశగా ఎదురుచూస్తున్నారు. మ్యాచ్ ప్రారంభంలో పిచ్ పరిస్థితులు సహజంగా ఆటకు అనుకూలంగా ఉండకపోయినా, బౌలింగ్ యూనిట్ అయితే తమ బాధ్యతను పూర్తిగా నిర్వర్తించిందని అన్నారు. కానీ, బ్యాటింగ్ విభాగం తగిన స్థాయిలో సహకరించకపోవడం నిరాశ కలిగించిందన్నారు. ప్రారంభంలో తక్కువ పరుగులకు వికెట్లు కోల్పోవడం, భాగస్వామ్యాల లోపం వల్ల స్కోరు వేగంగా పెరగలేదని చెప్పారు. పడిక్కల్ ను పక్కన పెట్టిన నిర్ణయం పిచ్ పరిస్థితులపై ఆధారపడి తీసుకున్నదని తెలిపారు. అయినప్పటికీ, వికెట్ అంతగా చెడూగా లేదని, అది కవర్లలో ఎక్కువసేపు ఉండడం వల్ల ప్రత్యర్థి బౌలర్లకు సహాయపడిందన్నారు. అయినా బౌలర్లు ఎలా బౌలింగ్ చేసినా, బ్యాటర్లు బాధ్యతగా ఆడాల్సిన అవసరం ఉందని పాటిదార్ పేర్కొన్నారు. “బౌలింగ్ యూనిట్ చాలా బాగా రాణించింది. అది పెద్ద సానుకూల అంశం. బ్యాటర్లు కూడా ఉద్దేశ్యంతో ఆడారు, కానీ కొన్ని తప్పులను మేం సరిదిద్దుకోవాల్సి ఉంది,” అంటూ తన జట్టు లోపాలపై స్పందించారు. మ్యాచ్‌లో %RCB% టీమ్ 42 పరుగులకే ఏడు వికెట్లు కోల్పోయి తీవ్రంగా ఒత్తిడిలో పడింది. టిమ్ డేవిడ్ అర్ధ సెంచరీతో (25 బంతుల్లో 50) కొంత మద్దతు ఇచ్చినా, మొత్తంగా జట్టు కేవలం 95 పరుగులు మాత్రమే చేయగలిగింది. బౌలింగ్ విభాగంలో జోష్ హేజిల్‌వుడ్ 3/14తో అద్భుతంగా రాణించినా, పంజాబ్ కింగ్స్ జట్టు 11 బంతులు మిగిలి ఉండగానే ఐదు వికెట్ల తేడాతో విజయాన్ని సాధించింది. బెంగళూరులో ఇది ఆర్‌సిబికి వరుసగా మూడో ఓటమిగా నమోదవడం, సొంత మైదానంలో పరాజయాల పరంపర కొనసాగడం అభిమానులను నిరాశపరిచింది. రెండు జట్లు మళ్లీ ఏప్రిల్ 20న ముల్లన్‌పూర్‌లో తలపడనున్న నేపథ్యంలో, %RCB% తమ తప్పులను సరిదిద్దుకొని పుంజుకోవాలన్న అంచనాలు మొదలయ్యాయి. ఈ ఓటమితో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టుపై విమర్శలు తీవ్రమవుతున్నాయి. ప్లే ఆఫ్స్ అవకాశాలు కాస్త క్లిష్టంగా మారుతున్న వేళ, జట్టు కీలక ఆటగాళ్లు బాధ్యతతో ఆడాల్సిన అవసరం మరింత పెరిగింది. కెప్టెన్ రజత్ పాటిదార్ నాయకత్వం, టిమ్ డేవిడ్ వంటి ఆటగాళ్ల స్పెషల్ ఇన్నింగ్స్‌లు మాత్రమే కాకుండా మిగిలిన బ్యాటర్ల సమిష్టి ప్రదర్శన కూడా కీలకం కానుంది. బౌలింగ్ విభాగం మంచి ప్రదర్శన ఇస్తున్న నేపథ్యంలో, జట్టు విజయాలు సాధించాలంటే బ్యాటింగ్ విభాగం ఆధారంగా నిలవాల్సిన అవసరం స్పష్టంగా కనిపిస్తోంది. అభిమానులు తమ జట్టు తిరిగి గెలిచే దారిలోకి వస్తుందని ఆశగా ఎదురుచూస్తున్నారు.



## కోహ్లీ,రోహిత్, ధోనీ సరసన కేఎల్ రాహుల్!

ఢిల్లీ క్యాపిటల్స్ స్టార్ బ్యాటర్ కేఎల్ రాహుల్ చరిత్ర సృష్టించాడు. నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచులో అరుదైన ఘనతను సాధించాడు. ఐపీఎల్ చరిత్రలో అత్యంత వేగంగా 200 సిక్సులు బాదిన ఫాసెస్ట్ ఇండియన్ బ్యాటర్ గా నిలిచాడు.తన 128వ ఇన్నింగ్స్ లో 200 సిక్సుల మార్క్ ను దాటాడు కేఎల్ రాహుల్. గుజరాత్ టైటాన్స్ పేసర్ మహ్మద్ సిరాజ్ బౌలింగ్‌లో లాంగాన్ మీదుగా భారీ సిక్స్ (89 మీటర్లు) బాది.. ఈ ఫీట్ అందుకున్నాడు రాహుల్. ఊహించని విధంగా బంతిని స్టాండ్స్‌లోకి పంపించి అదరగొట్టాడు. ఐపీఎల్‌లో రాహుల్‌కు ఇది 200వ సిక్స్ కావడం విశేషం. ఓవరాల్ గా ఈ ఫీట్ ను అత్యంత వేగంగా అందుకున్న మూడో క్రికెటర్ గా నిలిచాడు కేఎల్ రాహుల్. ఈ జాబితాలో అగ్రస్థానంలో వెస్టిండీస్ బ్యాటర్ క్రిస్ గేల్ ఉన్నాడు. అతడు 69 ఇన్నింగ్స్ లోనే ఐపీఎల్ లో 200 సిక్సులు కొట్టాడు. ఆ తర్వాత మరో విండీస్ స్టార్ ప్లేయర్ ఆండ్రూ రస్సెల్.. 97 ఇన్నింగ్స్ లో దీన్ని అందుకున్నాడు.

ఏ క్రికెటర్ ఎన్ని ఇన్నింగ్స్ లో 200 సిక్సుల మార్క్ అందుకున్నారంటే

క్రిస్ గేల్ – (69)
ఆండ్రూ రస్సెల్ – (97)
కేఎల్ రాహుల్ – (128)
ఏబీ డివిలియర్స్ – (137)
డేవిడ్ వార్నర్ – (148)
కీరన్ పొలార్డ్ – (150)

ఐపీఎల్ లో అత్యధిక సిక్సులు బాదిన క్రికెటర్లు వీరే

క్రిస్ గేల్ – 357 సిక్సులు
రోహిత్ – 286
విరాట్ – 282
ధోనీ – 260
ఏబీ డివిలియర్స్ – 251
వార్నర్ – 236
కీరన్ పొలార్డ్ – 223
సంజూ శాంసన్ – 216
యాండ్రూ రసెల్ – 212
సురేశ్ రైనా – 213
కేఎల్ రాహుల్ – 200

# ఓటిటిలోకి రానున్న మ్యాడ్ స్క్వేర్



కబురు సినిమా ఏప్రిల్ 19:
ఇటీవల విడుదలైన యూత్ ఫుల్ ఎంటర్ టైనర్ మూవీ 'మ్యాడ్ స్క్వేర్' ఎలాంటి విజయం అందుకుందో చెప్పక్కర్లేదు. ఉగాది కానుకగా మార్చి 28న గ్రాండ్‌గా వరల్డ్ వైడ్ రిలీజైన ఈ మూవీ కామెడీ, లవ్, ఫ్రెండ్షిప్ అంశాలతో యూత్‌ను విపరీతంగా ఆకట్టుకుంది. నార్నె నితిన్, సంగీత్ శోభన్, రామ్ నితిన్..లు హీరోలుగా నటించిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద మంచి కలెక్షన్లు వసూలు చేసింది. 'మ్యాడ్' మూవీకి కొనసాగింపుగా రూపొందడంతో 'మ్యాడ్ స్క్వేర్' మూవీ పై మొదటి నుండి తెలుగు ప్రేక్షకుల మంచి అంచనాలు పెట్టుకున్నారు. ఆ అంచనాలకు తగినట్లుగా ముగ్గురు హీరోలు తమ టాలెంట్ తో మంచి టాక్ తెచ్చుకున్నారు. ముఖ్యంగా లడ్డు యాక్టింగ్, కామెడీ టైమింగ్ బాగా ఆకట్టుకుంది. ఎన్టీఆర్ సక్సెస్ మీట్‌కి రావడం కూడా ఈ మూవీకి కొంత హెల్ప్ అయింది. ఇక ఈ చిత్రం థియేటర్స్‌లో రన్‌ని దాదాపు కంప్లీట్ చేసుకోవచ్చింది. దీంతో తాజాగా ఈ మూవీ ఓటీటీ రిలీజ్‌కి రెడీ అవుతున్నట్టుగా తెలుస్తోంది. అయితే ఈ సినిమా స్ట్రీమింగ్ హక్కులు దిగ్గజ స్ట్రీమింగ్ సంస్థ నెట్ ఫ్లిక్స్ సొంతం చేసుకున్నది. ఈ చిత్రం ఈ ఏప్రిల్ 25 నుంచి అలరించేందుకు వచ్చేస్తుంది అని తెలుస్తుంది. అయితే పాన్ ఇండియా భాషల్లో కాకుండా కేవలం తెలుగులోనే ఈ చిత్రం రానున్నట్టు టాక్.

# రామాయణ 2 కోసం..



కబురు సినిమా ఏప్రిల్ 19:
కథానాయకుడు యశ్ నిర్మిస్తున్న బహుభాషా చిత్రాల్లో 'టాక్సిక్'తో పాటు 'రామాయణ' ఉన్న సంగతి తెలిసిందే. నితేశ్ తివారీ రూపొందిస్తున్న ఈ సినిమా రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇందులో రాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతగా సాయిపల్లవి నటిస్తుండగా.. రావణుడి పాత్రను యశ్ పోషిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా తొలి భాగం చిత్రీకరణ ముగింపు దశకు చేరుకోగా.. ఇప్పుడు రెండో భాగానికి సంబంధించి ఓ ఆసక్తికర విషయం బయటకొచ్చింది. మే నెలాఖరు నుంచి 'రామాయణ: పార్ట్ 2' చిత్రీకరణ మొదలు కానుందని సమాచారం. ఈ షెడ్యూల్‌లో తొలుత సీత పాత్రకు సంబంధించి అశోక వనం ఎపిసోడ్స్ చిత్రీకరించనున్నారని.. జూన్ నుంచి రణ్‌బీర్‌పై రాముడి పాత్రకు సంబంధించిన సన్నివేశాలు తెరకెక్కిస్తారని తెలిసింది. అలాగే వీళ్లిద్దరిపై రెండు పాటల్ని కూడా చిత్రీకరించనున్నట్లు తెలుస్తోంది. ఇక ఈ చిత్ర తొలి భాగం వచ్చే ఏడాది దీపావళికి రానుండగా.. రెండో భాగం 2027 దీపావళికి విడుదల కానుంది.



# తెరపైకి కొత్త కలయిక

కబురు సినిమా ఏప్రిల్ 19:
కథానాయకుడు కార్తి చకచకా సినిమాలు పూర్తి చేస్తూ జోరు చూపిస్తున్నారు. ఇప్పటికే ఆయన చేసిన 'వా వాతియారే' విడుదలకు సిద్ధమవ్వగా.. 'సర్దార్ 2' ముగింపు దశకు చేరుకుంది. మరోవైపు తమిళ దర్శకత్వంలో తన 29వ చిత్రాన్ని.. దర్శకుడు లోకేశ్ కనగరాజ్‌తో 'ఖైదీ 2'ను పట్టాలెక్కించేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. ఇప్పుడీలోగానే ఆయన మరో కొత్త చిత్రానికి సంతకాలు చేసినట్లు తెలుస్తోంది. ప్రముఖ తమిళ దర్శకుడు, నటుడు సుందర్.సితో కలిసి ఓ సినిమా చేయనున్నారని సమాచారం. ఇప్పటికే ఈ విషయమై వీళ్లిద్దరి మధ్య చర్చలు పూర్తయినట్లు తెలిసింది. ప్రస్తుతం కార్తితో 'సర్దార్ 2'ని నిర్మిస్తున్న ప్రిన్స్ పిక్చర్స్ సంస్థే ఈ కొత్త చిత్రాన్నీ నిర్మించనున్నట్లు తెలిసింది. ప్రస్తుతం సుందర్ తెరకెక్కిస్తున్న 'మూకుతి అమ్మన్ 2' చిత్రీకరణ పూర్తయ్యాక ఈ ప్రాజెక్ట్ పట్టాలెక్కనుంది.

# డ్రగ్స్ కేసు.. 'దసరా' విలన్ షైన్ టామ్ చాకో అరెస్ట్



కబురు సినిమా ఏప్రిల్ 19:
మలయాళ నటుడు షైన్ టామ్ చాకో ను కేరళ పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. మాదక ద్రవ్యాలను తీసుకుంటున్నారనే ఆరోపణలతో ఈరోజు ఉదయం విచారణకు హాజరైన ఆయన్ని పోలీసులు నాలుగు గంటల పాటు ప్రశ్నించారు. అనంతరం అరెస్టు చేశారు. త్వరలోనే నటుడికి వైద్య పరీక్షలు నిర్వహించి తదుపరి ప్రక్రియ చేపట్టనున్నట్లు పోలీసులు వెల్లడించారు.కొచ్చిలోని ఓ హోటల్‌లో డ్రగ్స్ వినియోగిస్తున్నారన్న సమాచారంతో పోలీసులు ఇటీవల సోదాలు చేశారు. అయితే పోలీసుబృందం హోటల్‌కు రావడానికి కొద్దిసేపటి ముందే షైన్ టామ్ చాకో అక్కడి నుంచి పారిపోయినట్లు వార్తలు వచ్చాయి. ఆ సమయంలో మూడో అంతస్తులో ఉన్న అతను.. కిటికీలోంచి రెండో అంతస్తులోకి దూకి అక్కడినుంచి పారిపోతున్న దృశ్యాలు నెట్టింట వైరల్ అయ్యాయి. దీంతో పోలీసులు నటుడికి సమన్లు జారీ చేశారు. విచారణకు రావాలని ఆదేశించారు. ఈ క్రమంలోనే శనివారం ఉదయం 10 గంటల సమయంలో ఎర్నాకుళం నార్త్ పోలీస్ స్టేషన్‌కు తన న్యాయవాదితోపాటు ఆయన హాజరయ్యారు.

# ఇది ఆందోళన కలిగించే విషయం.. ఏఐ టెక్నాలజీపై ఏఆర్ రెహమాన్ కామెంట్



కబురు సినిమా ఏప్రిల్ 19:
ప్రస్తుతం ఏఐ ప్రవేశించని రంగం లేదు. ఇటీవలకాలంలో సినిమాల్లోనూ దీని వినియోగం పెరిగిన సంగతి తెలిసిందే. దీన్ని ఉపయోగించి దివంగత గాయకుల వాయిస్‌తో పాటలు క్రియేట్ చేస్తున్నారు. ఈ విషయంపై ఏఆర్ రెహమాన్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. దీనిని నియంత్రించకపోతే భవిష్యత్తులో గందరగోళ పరిస్థితులు వస్తాయని హెచ్చరించారు. ఏఐ టెక్నాలజీ ఎంతో శక్తిమంతమైనదని కానీ, అవసరానికి మించి దీన్ని వినియోగించకూడదన్నారు."ఏఐ వల్ల మంచి, చెడు రెండూ ఉన్నాయి. మంచి కోసం మాత్రమే దీన్ని వినియోగించాలి. కొన్ని రోజులుగా దీని వినియోగం చూస్తుంటే ఆందోళన కలుగుతోంది. కొన్ని చెత్త పాటలను కూడా గొప్ప గాయకులు పాడినట్లు క్రియేట్ చేస్తున్నారు. దీనికి ఎవరు బాధ్యత తీసుకుంటారో తెలియడం లేదు. ప్రతి దానికి కొన్ని నియమాలు ఉంటాయి. పెరుగుతున్న టెక్నాలజీని ఉపయోగించడానికి కూడా కొన్ని పరిమితులు ఉంటాయి. వాటిని అందరూ తెలుసుకోవాలి" అని అన్నారు.కోలీవుడ్‌లో మొదట అలా చేసింది నా తనయుడే..: తండ్రి మాటలతో సూర్య ఎమోషనల్ గతేడాది విడుదలైన 'లాల్ సలామ్'లో ఏఆర్ రెహమాన్ కృత్రిమ మేధస్సు సాంకేతికతను ఉపయోగించి దివంగత గాయకులు బంబా బక్యా, షాహుల్ హమీద్‌ల గాత్రాన్ని పునఃసృష్టించిన విషయం తెలిసిందే. ఈ గాయకులిద్దరూ గతంలో రెహమాన్ సంగీతం సమకూర్చిన చాలా సినిమాల్లో పాడారు. గాయకులిద్దరి కుటుంబాల అనుమతి తీసుకొని కృత్రిమ మేధ అల్గరిథమ్ ద్వారా మరోసారి వారి వాయిస్‌ను వినిపించారు.



# అబ్బాయిలకు పీరియడ్ పెయిన్ వస్తే అణు యుద్ధాలే: జాన్వీకపూర్

కబురు సినిమా ఏప్రిల్ 19:
నెలసరి సమయంలో మహిళలు ఎదుర్కొనే బాధ వర్ణణాతీతం. శారీరకంగా, మానసికంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటారు. ఇక అప్పుడు వచ్చే మూడ్ స్వింగ్స్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. అయితే, నెలసరిలో వచ్చే నొప్పిని చులకనగా చూస్తే అది మరింత బాధగా ఉంటుంది. ఇదే విషయాన్ని ప్రస్తావించారు నటి జాన్వీ కపూర్ . తనకు కూడా పీరియడ్ మూడ్ స్వింగ్స్ ఉన్నాయన్నారు. "నాకు పీరియడ్స్ సమయంలో విపరీతమైన మూడ్ స్వింగ్స్ వస్తాయి. నా మాట తీరుని బట్టి నేను పీరియడ్స్‌లో ఉన్నానని ఎదుటి వారికి అర్థం అయిపోతుంది. అందుకే నేను చిరాకుగా మాట్లాడగానే 'నీకు ఇది ఆ సమయమా' అని అడుగుతారు. అయితే ఈ ప్రశ్న అడిగే విధానమే ఒక్కోసారి బాధను కలిగిస్తుంది. కొందరు ఈ నెలసరి నొప్పి అనేది చాలా చిన్న విషయంగా పరిగణిస్తూ వ్యంగంగా మాట్లాడతారు. దీన్ని అర్థం చేసుకున్నవాళ్లు మాత్రం మనకు ప్రశాంతత కలిగేలా ప్రవర్తిస్తారు. విశ్రాంతి తీసుకోమని సలహాలిస్తారు" కోలీవుడ్‌లో మొదట అలా చేసింది నా తనయుడే..: తండ్రి మాటలతో సూర్య ఎమోషనల్ "పీరియడ్ పెయిన్ అనుభవించేవారికి మాత్రమే తెలుస్తుంది. ఆ సమయంలో మేం పడే బాధను, ఈ మానసిక స్థితిని అబ్బాయిలు ఒక్క నిమిషం కూడా భరించలేరని కచ్చితంగా చెప్పగలను. ఒకవేళ మగవాళ్లకు పీరియడ్స్ వస్తే ఆ నొప్పికి అణుయుద్ధాలే జరిగేవేమో..!" అని జాన్వీ చెప్పారు. ఈ విషయం గురించి ఆమె ధైర్యంగా మాట్లాడారంటూ నెటిజన్లు ప్రశంసిస్తున్నారు. దీనిపై బహిరంగ చర్చ అవసరమని కొందరు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు.ఇక ఇటీవల సమంత కూడా మహిళల నెలసరి సమస్యల గురించి మాట్లాడారు. ఇప్పటికీ కూడా కొందరు దీని గురించి బహిరంగంగా మాట్లాడాలంటే సిగ్గుపడుతున్నారని అన్నారు. అది పెద్ద తప్పు అన్నట్లు గుసగుసలాడుతుంటారని, ఈ ధోరణిలో మార్పు రావాలని కోరారు. ఇది మహిళల్లో జరిగే సహజ ప్రక్రియ అని తెలిపారు.

పెళ్లి ఎప్పుడో చెప్పలేను

# దానిపై అంతగా ఆసక్తి కూడా లేదు

## థగ్‌లైఫ్ ప్రమోషన్‌లో నటి త్రిష కామెంట్స్



కబురు సినిమా ఏప్రిల్ 19:
నాలుగు పదుల వయసులోనూ వరుస సినిమాలు చేస్తూ ప్రేక్షకులను అలరిస్తున్నారు నటి త్రిష. అయితే, ఆమె వైవాహిక బంధంలోకి ఎప్పుడు అడుగు పెడుతుందా అని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఆమె పెళ్లి గురించి ఇప్పటికే ఎన్నో వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో తాజాగా ఆమె వివాహంపై తన అభిప్రాయాన్ని బయటపెట్టారు. తనకు పెళ్లిపై సదుద్దేశం లేదని వ్యాఖ్యలు చేశారు. 'థగ్ లైఫ్' ప్రమోషన్స్‌లో భాగంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమెను.. 'మూడుముళ్ల బంధంపై మీ అభిప్రాయం ఏమిటని ప్రశ్నించగా.. నిజం చెప్పాలంటే నాకు వివాహంపై నమ్మకం లేదు. నాకు పెళ్లి అయినా ఓకే, కాకపోయినా ఫర్వాలేదని ఆమె బదులిచ్చారు. ఆమె ఇచ్చిన సమాధానంతో పక్కనే ఉన్న కమల్‌హాసన్ షాకయ్యారు. త్రిష పెళ్లి గురించి కొంతకాలంగా వదంతులు వ్యాప్తి చెందుతోన్న విషయం తెలిసిందే. ఆమె ప్రేమలో ఉన్నారని త్వరలోనే పెళ్లి పీటలెక్కనున్నారని ఇటీవల ప్రచారం జరిగింది. ఆ వదంతులను ఆమె ఖండించారు. పెళ్లి ఎందుకు చేసుకోలేదు అంటే నా వద్ద సమాధానం లేదు. పెళ్లి ఎప్పుడు చేసుకుంటానో మాత్రం నాకే తెలియదు. నా మనసుకు నచ్చిన వ్యక్తి దొరికితే కచ్చితంగా చేసుకుంటాను. నన్ను పెళ్లి చేసుకోబోయేవాడు జీవితాంతం నాకు తోడు ఉంటాడనే నమ్మకం కలగాలి. అప్పుడే చేసుకుంటాను. పెళ్లి చేసుకొని విడాకులు తీసుకోవడం నాకు ఇష్టం లేదు. పెళ్లి చేసుకొని చాలామంది అసంతృప్తితో జీవిస్తున్నారు. అలాంటి పరిస్థితి నాకు ఎదురుకాకూడదని ఓ సందర్భంలో చెప్పారు. థగ్ లైఫ్' విషయానికి వస్తే.. మణిరత్నం – కమల్ హాసన్ కాంబినేషన్‌లో రూపొందిన చిత్రమే ఇది. సుమారు 38 ఏళ్ల తర్వాత వీరిద్దరి కాంబోలో వస్తోన్న చిత్రమిది. శింబు, త్రిష కీలక పాత్రలు పోషించారు. శుక్రవారం ఈ సినిమా నుంచి పెళ్లి సాంగ్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఇందులో చిత్రబృందం పాల్గొని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పాన్ ఇండియా స్థాయిలో జూన్ 5న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకురానున్నట్లు– చెప్పారు. ఇందులో పాల్గొన్న త్రిష.. థగ్ లైఫ్'లో అవకాశం వచ్చినందుకు సంతోషంగా భావిస్తున్నా. కమల్‌హాసన్ లాంటి గొప్ప నటుడితో స్క్రీన్ పంచుకోవడం నా అదృష్టం అని తెలిపారు.

Printed & Published and owned by K. Shiva Kumar Goud, Printing at Srinika Printers, Railway Kaman Track, Sony Function Haal Road, Nizamabd.(TS). Editor: K. Shiva Kumar Goud. Registration No. APTEL/1999/00110/, kabirueveningdaily9106@gmail.com